ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

బుధవారం 27 ఆగస్టు 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 29.0
కనిష్ఠం: 25.0





సందడిగా మారిన ఏలూరు మార్కెట్..

పత్రి, పండ్లు, పూలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలు

నేను.. వచ్చేస్తున్నా !

వక్రతుండ మహాకాయ
కోటి సూర్య సమప్రభ
నిర్విఘ్నం కురుమేదేవా
సర్వకార్యేషు సర్వదా !

విఘ్ననాథుని పూజకు వేళయింది.. బుధవారం వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. వాడవాడలా గణేశ్ మండపాలు వెలిశాయి.. వర్షంతో మార్కెట్ కాస్త డల్ అయినా ఉత్సాహం అయితే తగ్గలేదు.

– లోపలి పేజీల్లో..



బార్‌లకు దరఖాస్తుల గడువు పొడిగింపు

» 30న లాటరీ ద్వారా కేటాయింపులు

ఏలూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):అనుకున్న స్థాయిలో బార్‌లకు దరఖాస్తులు రాకపోవడంతో గడువును మరో మూడు రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంగళవారం సాయంత్రంతో గడువు ముగియడంతో జిల్లాలోని 18 బార్‌లకు కేవలం ఆరు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. లాటరీ తీయడానికి పరిస్థితులు లేవు. దీనితో గడువు ఈ నెల 29వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు పొడిగించినట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. గీత కులాలకు కేటాయించిన రెండు బార్లకు 29తో గడువు ముగుస్తుందన్నారు. ఈ నెల 30న మొత్తం 20 బార్లకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించి కలెక్టరేట్‌లో గోదావరి కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి లాటరీ తీసి లైసెన్సులను కేటాయిస్తారన్నారు. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు, ఔత్సాహికులు వినియోగించుకోవాలని వారు కోరారు.

టీచర్ల అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తు గడువు నేడు

ఏలూరు అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):అంతర్ జిల్లా బదిలీలు కోరుకునే అర్హులైన టీచర్లు ఆన్‌లైన్‌లో ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకుని, మూడు సెట్ల ప్రింటవుట్‌లను సంబంధిత ఎంఈవోకు సమర్పించాలని ఉమ్మడి జిల్లా డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. వాటిని ఎంఈవోలు 28లోగా, డీఈవో 29న ధ్రువీకరించుకుని పాఠశాల విద్య డైరెక్టర్‌కు 31వ తేదీలోగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. తుది నిర్ధారణ సెప్టెంబరు 1, 2 తేదీల్లో డైరెక్టరేట్‌లో చేపడతారని వివరించారు. అంతర్ జిల్లా బదిలీలకు అర్హతలు, ఇతర వివరాలు, ప్రొఫార్మాల కోసం డీఈవో ఏలూరు.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

కిశోర బాలికల భద్రతపై అవగాహన కల్పించాలి : కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):కిశోర వికాసం కార్యక్రమంలో కౌమార దశలో ఉన్న బాల, బాలికలకు వారి హక్కులు, భద్రతపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. కిశోర వికాసంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశనం చేశారు. ఆడపిల్లల ఉజ్వలమైన, ఆరోగ్యవంతమైన భవిష్యత్‌కు కిశోర వికాసం పున ప్రారంభ కార్యక్రమం పునాది వేస్తుందన్నారు. ఐసీడీఎస్ పీడీ పి.శారద మాట్లాడుతూ జిల్లాలో 11 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన కిశోర బాలికలు 34 వేల 95 మంది ఉన్నారు. వీరిని 5300 బృందాలుగా ఏర్పాటు చేశామన్నారు. అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, సాంఘికసంక్షేమశాఖ జేడీ విశ్వమోహన్‌రెడ్డి, సీడీపీవో తులసి, బాలల సంక్షేమాధికారి డాక్టర్ పి సూర్యచక్రవేణిలు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి జితేంద్రలు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రత కోసం.. ఏలూరులో ఆటోలకు క్యూ ఆర్ కోడ్‌లు

-9లో

కలెక్టరేట్.. ఫైట్ !

పశ్చిమ గోదావరి జిల్లా శాశ్వత కలెక్టరేట్ నిర్మాణంపై తలోమాట

» పెద అమిరంలో నిర్మించాలన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ

» భీమవరం నుంచి ఎక్కడికీ వెళ్లదన్న ఎమ్మెల్యే అంజిబాబు

» తరలిస్తే ఉద్యమిస్తామన్న కాంగ్రెస్, వైసీపీ



(భీమవరం-ఆంధ్రజ్యోతి):

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరేట్ శాశ్వత భవన నిర్మాణంపై ప్రాంతాల వారీగా రాజకీయ పక్షాల్లో చిచ్చు రేపింది. భీమవరం కేంద్రంగా పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పడినప్పటి నుంచి కలెక్టరేట్‌పై సస్పెన్స్ కొనసాగుతూనే వుంది. ప్రస్తుతం దీనిని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. శాశ్వత భవన నిర్మాణానికి వైసీపీ హయాంలో భీమవరం ఏఎంసీలోని 20 ఎకరాల భూమిని కేటాయించారు. నాటి ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో జారీచేసింది. గెజిట్ నోటిఫికేషన్ విడుదలచేసింది. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖకు ఏఎంసీ భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టరేట్ భవన సముదాయానికి ఆర్అండ్‌బీ ప్రణాళికలు చేయాల్సి ఉంది. ఈలోగా ప్రభుత్వం మారి కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ప్రాధామ్యాలు మారాయి. భీమవరం ఏఎంసీకి మరో చోట స్థలం కేటాయించడం కష్టమన్న భావనతో అక్కడ కలెక్టరేట్ ప్రతిపాదనను విరమించుకున్నారు. స్థల సేకరణ ప్రయత్నాలు ప్రారంభించారు. పెద అమిరంలోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో కలెక్టరేట్ నిర్మాణానికి అనువుగా ఉంటుందని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రయత్నించారు. దీనిని గతంలో భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు ఖండించారు. భీమవరంలోనే కలెక్టరేట్ ఉంటుందని ప్రకటించడంతో అప్పటికి సద్దుమణిగింది. తాజాగా శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కలెక్టరేట్ అంశాన్ని లేవనెత్తారు. కలెక్టరేట్‌ను భీమవరం నుంచి ఇతర

- మిగతా 10లో..

• ఉండి.. భీమవరం వేర్వేరు కాదు

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



కాళ్ళ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):'కలెక్టరేట్‌ని తరలించుకుపోతున్నామని వైసీపీ నాయకులు యాగీ చేయడం విడ్డూరంగా ఉంది. నా దృష్టిలో భీమవరం, ఉండి వేర్వేరు కాదు. కొంత మంది సంకుచిత ధోరణితో మాట్లాడుతున్నారు' అని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పెద అమిరం ఎప్పటికైనా భీమవరం మునిసిపాలిటీలో కలుస్తుందన్నారు. అన్ని హంగులతో కూడిన కలెక్టరేట్‌ను నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నదే తన కోరిక అన్నారు. కాళ్ళ మండలం పెద అమిరం క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'జిల్లా ఏర్పడిన తర్వాత కలెక్టరేట్ ఆఫీసు అద్దె భవనంలోనే కొనసాగుతోంది. భీమవరం మార్కెట్‌యార్డులో కలెక్టరేట్‌కు స్థలం కేటాయించినా అది ముందుకు వెళ్లలేదు. పెద అమిరంలో అన్యాక్రాంతమైన మూడు ఎకరాల 60 సెంట్ల భూమి ప్రభుత్వానికి అప్పగించాం. ఇక్కడ కలెక్టరేట్ నిర్మించవచ్చని నిర్మాణానికి రూ.70 కోట్లు అయితే రూ35 కోట్లు ప్రభుత్వం ఇస్తే, రూ.35 కోట్లను సమకూర్చి కలెక్టరేట్ నిర్మిస్తానని సీఎంకు వివరించా. మండలి చైర్మన్ మోషేన్‌రాజు ఇరిగేషన్ భూమి అని, కోర్టు ఆదేశాలు ఉంటే ఎలా నిర్మాణం చేస్తారనడం విడ్డూరంగా ఉంది. ఇరిగేషన్‌కు ఉన్న అదనపు భూమిని ప్రభుత్వం వాడుకోవచ్చని ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చింది' అని అన్నారు.

• కలెక్టరేట్ భీమవరంలోనే ఉంటుంది : ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): "కలెక్టరేట్ భీమవరంలోనే ఉంటుంది.. ఎక్కడికీ వెళ్లదు.. ఈ విషయంలో ఎటువంటి అపోహలకు, అనుమానాలకు తావు ఇవ్వవద్దు' అని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఉండి నియోజకవర్గానికి తరలిపోతుందనే వస్తున్న వార్తల నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్ అందరికీ ఉపయోగకరమైనది. అధికారులంతా ఒకేచోట ఉండాలన్నదే నా ఆలోచన. అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండాలంటే 25 ఎకరాల స్థలం అవసరం. దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, తాడేరులో స్థలాలను చూస్తున్నాం. గతంలో కలెక్టరేట్ కు ఐదు ఎకరాలు అందిస్తానన్నా. కానీ 25 ఎకరాలు ఉండాలని, పరేడ్ గ్రౌండ్, వీఐపీల పార్కింగ్ ఇలా ఎన్నో వాటికి స్థలం ఉండాలి' అని అన్నారు.

కాల్ లెటర్లు జారీ

మెగా డీఎస్సీ సెలెక్టెడ్ అభ్యర్థులకు రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఏలూరు అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కాల్ లెటర్ల జారీ ప్రారంభమైంది. తొలుత పీజీటీ, టీజీటీ కేడర్ సెలెక్టెడ్ అభ్యర్థుల లాగిన్‌లకు, మధ్యాహ్నం నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్ అభ్యర్థులకు కాల్‌లెటర్లు జారీ కాగా, రాత్రికి ఎస్జీటీ కేడర్ అభ్యర్థులకు అందాయి. అభ్యర్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకుని సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం వట్లూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు గురువారం ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ వెంకట లక్ష్మమ్మ తెలిపారు. కాల్ లెటర్‌లో చేసిన సూచనలను అభ్యర్థులు పాటించాలి. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, మూడు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు తెచ్చుకోవాలి. వెరిఫికేషన్‌కు హాజరు కావడానికి ముందుగానే అభ్యర్థి అన్ని సర్టిఫికెట్లను ఏపీడీఎస్సీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌లో వ్యక్తిగత లాగిన్‌ల నుంచి అప్‌లోడ్ చేయాలి. ఏమైనా సందేహాలు వుంటే హెల్ప్‌లైన్ నంబర్లు 90307 23444, 90523 91111లలో సంప్రదించాలి. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు జిల్లాల్లో ఏర్పాట్లపై పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు, రాష్ట్ర నోడల్ ఆఫీసర్లు మంగళవారం రాత్రి వెబెక్స్ విధానంలో డీఈవోలతో సమావేశం నిర్వహించారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాటు చేసిన ముగ్గురు గెజిటెడ్ అధికారులతో కూడిన టీమ్‌ల విధులపై సూచనలు చేశారు. జోన్-2 జిల్లాల అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు రాష్ట్ర నోడల్ ఆఫీసర్‌గా ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డిని నియమించారు.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో..

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):డీఎస్సీ-2025 ఉద్యోగ నియామక ప్రక్రియ వేగవంతమైనట్లు ఉమ్మడి కృష్ణా జిల్లా డీఈవో పి.వి.జె. రామారావు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి అభ్యర్థుల సెల్‌ఫోన్లకు కాల్ లెటర్లు వస్తున్నాయని తెలిపారు. మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 28 ఉదయం 9 గంటల నుంచి మచిలీపట్నం నోబుల్ కళాశాలలో జరుగుతుందని చెప్పారు. జిల్లా పరిశీలకుడిగా సమగ్ర శిక్ష అధికారి ప్రసన్నకుమార్ హాజరవుతున్నారని వివరించారు.

జాతీయ ఉత్తమ అధ్యాపకునిగా దేవానంద్



మండవల్లి/మైలవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా మండవల్లికి చెందిన డాక్టర్ మెండా దేవానంద్‌కుమార్ ఉత్తమ జాతీయ అధ్యాపకునిగా ఎంపికయ్యారు. గురు పూజోత్సవం రోజు సెప్టెంబరు 5న న్యూఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు. కృష్ణా జిల్లా మైలవరంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్న దేవానంద్ విద్యార్థులకు విద్యాబోధనలు అందించడమే కాకుండా వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన తెలుగులో ఎం.ఏ, ఎం.ఫిల్, పీహెచ్‌డీ, ఎంఏ హిస్టరీ, బీఈడీ, ఎంఈడీ చేసి యూజీసీ నీట్, స్లేట్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించి అధ్యాపకునిగా కెరీర్ ప్రారంభించారు. 38 పరిశోధక పత్రాలు, పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించి, ఐదు గ్రంథాలు రాశారు. 2021 నుంచి లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న దేవానంద్ విద్యార్థులలో నైపుణ్యాలను పెంచేందుకు కృషి చేశారు. జర్నలిజం, తాళపత్ర గ్రంథాల రచన, జీవన నైపుణ్యాలను అనువాదం వంటి విషయాలపై 12 సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించారు. విద్యార్థులతో నిరంతరం మమేకమయ్యే దేవానంద్ పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కళాశాల యూత్ ఫెస్టివల్ లహరి కళాశాల వార్షికోత్సవం వార్షిక పాఠ్యాంశాలపై విద్యార్థులతో కళాశాల బోధి స్టూడియోలో విద్యాపరమైన వీడియోలు తీయడం వంటి కార్యక్రమాల్లో కీలకపాత్ర వహించారు. జాతీయ అవార్డు గ్రహీతకు కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. గత ఏడాది సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2024ను అందుకున్నారు. మండవల్లికి ఇంతటి గుర్తింపు తీసుకువచ్చినందుకు గ్రామ సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్‌బాబు గ్రామస్థులు అభినందించారు.

చాలా సంతోషంగా ఉంది

దేశం మొత్తం మీద ఎంపికైన 21 మందిలో నేను ఒకడిని అయినందుకు చాలా సంతోషంగా ఉంది. అవార్డు నాలో మరింత స్ఫూర్తిని నింపింది. ఇలాంటి అవార్డులు ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకు రావడం ప్రభుత్వ కళాశాలల మీద విద్యార్థులకు వారి తల్లిదండ్రులు మరింత నమ్మకాన్ని కలిగిస్తాయి.

- దేవానంద్‌కుమార్

ఇదేం వైద్యం !

» పనిచేసేది ఒకచోట

» ముఖ హాజరు మరోచోట

» ఆ పది మంది డాక్టర్ల తీరిది

» విస్తుబోతున్న అధికారులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విధులు నిర్వర్తించాల్సిన పీహెచ్‌సీ ఒకచోట.. ముఖగుర్తింపు ఆధారిత హాజరు(ఎఫ్ఆర్ఎస్) నమోదు మరోచోట.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పలువురు వైద్యాధికారులు పాటిస్తోన్న పద్ధతి ఇది. మంగళవారం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్ల ఎఫ్ఆర్ఎస్ హాజరును డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు పరిశీలిస్తే పది మంది తమకు కేటాయించిన పీహెచ్‌సీల్లో కాకుండా వేరేచోట హాజరును నమోదు చేయడం, జంగారెడ్డిగూడెం, విజయవాడల్లో హాజరు వేయడం, మరికొందరు జిల్లా అధికారుల అనుమతి లేకుండా గైర్హాజరవడం వంటివి వెలుగులోకి వచ్చాయి. గతంలో ఎఫ్ఆర్ఎస్ నమోదును ఐ ఫోన్లలో ట్యాంపరింగ్ ద్వారా నమోదు చేయడం, పనిస్థానాలకు వెళ్లకుండానే హాజరైనట్టు అటెండెన్స్ వేయడాన్ని అత్యాధునిక సాంకేతికతతో ఎఫ్ఆర్ఎస్ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ ఆధారాలతోసహా గుర్తించి తప్పుడు పద్ధతులను పాటించినందుకు 21 మంది మెడికల్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు జారీచేసిన విషయం విదితమే. తాజాగా మళ్లీ అవే పరిస్థితులు జిల్లాలో కొనసాగుతున్నట్టు తాజా సంకేతాలు రుజువు చేస్తున్నాయి. మంగళవారం విధులకు గైర్హాజరు లేదా మరోచోట ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసిన వైద్యాధికారులకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో విడతల వారీగా నిర్వహిస్తోన్న ఎన్‌సీడీ 4.0 ప్రోగ్రాంలో శిక్షణకు తప్పనిసరిగా హాజరుకావాలి. వీరిలో పలువురు శిక్షణకు గైర్హాజరు కావడంతో ఈ నెల 28న మలివిడత శిక్షణకు హాజరు కావాలని అధికారులు సూచించారు. నిబంధనల ప్రకారం పనిస్థానంలో విధులు నిర్వర్తించకుండా లేదా ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయకపోయినా తగిన కారణాలను అధికారులకు చూపడంతోపాటు, వారి అనుమతిని తీసుకోవడం తప్పనిసరి. మంగళవారం నాటి ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదులో క్రమశిక్షణా రాహిత్యం వెలుగులోకి రావడం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

విద్వేషాలు సృష్టించేందుకే..

» రంగా విగ్రహాలకు పేడ పూశారు..

ఇద్దరు యువకులు, బాలుడి అరెస్ట్

కైకలూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో విద్వేషాలు రేపి, అల్లర్లు సృష్టించేందుకు ప్రణాళికాబద్ధంగా మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా విగ్రహాలకు పేడ పూసినట్లు కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. ఈ కేసులో ఇద్దరు యువకులతోపాటు ఓ మైనర్ బాలుడిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కైకలూరు పోలీసు స్టేషన్‌లో మంగళ వారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 'ఈ నెల 22 రాత్రి కలిదిండి, సానారుద్రవరంలోని రంగా విగ్రహాలకు గొల్లగూడెంకు చెందిన కట్టా ఈశ్వర్‌కుమార్(22), కలిదిండికి చెందిన ఉండ్రాల అయ్యప్ప(26)తోపాటు మరో మైనర్ బాలుడు పథకం ప్రకారం విగ్రహాలకు పేడ పూశారు. 23న కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐదు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను గుర్తించాం. వీరు ముగ్గురు మంగళవారం కలిదిండి ఏఎంసీ ప్రాంతంలో బైక్‌పై వెళుతుండగా అదుపులోకి తీసుకుని విచారించాం. వారు నేరం అంగీకరించడంతో అరెస్టు చేశాం. గత ఏడాది ఇదే తేదీల్లో కలిదిండి ప్రాంతంలో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకుని మళ్లీ విద్వేషాలు రెచ్చగొట్టినా ఎవరూ గుర్తించలేరని పక్కా ప్రణాళికతో ఈ ముగ్గురిని విగ్రహాలకు హాని కలిగేలా కొందరు ప్రేరేపించారు. ఇలా చేస్తే రెండు వర్గాల మధ్యన విద్వేషాలు పెరుగుతాయని, ఒక వర్గానికి హాని కలిగే విధంగా ఉంటుందని ఆలోచన చేశారు. పోలీసులు అప్రమత్తమై వీరిని అరెస్టు చేయడంతో వారి కుట్ర వెలుగులోకి వచ్చింది. ఈశ్వర్‌కుమార్ గతంలో హత్యకేసులో నిందితుడని ఈ కేసును మరింత విచారించి వీరి వెనుక వున్న వ్యక్తులను బయటకు తీస్తాం' అని సీఐ వెల్లడించారు. సమావేశంలో ఎస్ఐలు వి.వెంకటేశ్వరరావు, వి.రాంబాబు పాల్గొన్నారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ రవికుమార్


భీమవరంలో పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్‌లో రద్దీ


పెనుగొండలో గణనాథుడి మట్టి ప్రతిమలతో చిన్నారులు


ఏలూరులో పూల మార్కెట్‌లో కొనుగోలుదారుల రద్దీ

గణపతి పూజకు వేళాయె..

• నేడు వినాయక చవితి • పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేక మండపాలు • మార్కెట్‌లో పూజా సామగ్రి


భీమవరంలో పూజా సామగ్రి విక్రయం


తాడేపల్లిగూడెంలో మట్టి ప్రతిమల విక్రయం


ఆకివీడులో పత్రి అమ్మకం

ఏలూరు సిటీ/ఏలూరు కార్పొరేషన్/భీమవరం టౌన్/తాడేపల్లిగూడెం రూరల్/, పాలకొల్లు అర్బన్/నరసాపురం/తణుకు/ఆచంట/చింతలపూడి/కొయ్యలగూడెం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తొలిపూజ విఘ్నేశ్వరుడిదే.. వినాయకుడిని కొలిస్తే సర్వ శుభాలు కలుగుతాయని నమ్మకం. ఉమ్మడి జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఏలూరు రామకోటి సెంటర్, కుండీ సెంటర్, కూరగాయల మార్కెట్, తంగెళ్లమూడి వద్ద భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. పవరుపేటలో వందేళ్ల చరిత్ర కలిగిన పదకొండున్నర అడుగుల ఏకశిల విగ్రహంగా కొలువు తీరిన విజయగణపతి ఆలయం, సత్రంపాడు లక్ష్మీ గణపతిస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తిచేశారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మంగళవారం నుంచి ముసురేసినా గణేశ ప్రతిమలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్‌లు కిటకిటలాడాయి. భీమవరం పట్టణంలో వీదివీధిన చవితి మండపాలు వెలిశాయి. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు యువత ఏర్పాట్లు చేశారు. 5 అడుగుల విగ్రహాలతో పాటు పలుచోట్ల భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెంలో చామంతి, బంతి పూలు కిలో రూ.250 నుంచి 300 ధరకు విక్రయించగా సాధారణ బంతి పూల దండ రూ.150, గులాబి దండ రూ.500 ధర పలికాయి. దానిమ్మ పండు రూ.50 యాపిల్ రూ.50, అరటిపళ్లు డజను రూ.80 ధరకు విక్రయించారు.

పాలకొల్లు పట్టణంలో మట్టి, పీవోపీతో తయారు చేసిన గణపతి విగ్రహాలు వివిధ సైజుల్లో రంగుల్లో అమ్మకానికి ఉంచారు. పూలు, పండ్లు, పత్రికి డిమాండ్ పెరగడంతో అధిక ధరకు విక్రయించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ మార్కెట్ అంతా రద్దీగా కనపడింది. నరసాపురం మెయిన్‌రోడ్ నుంచి శివాలయం సెంటర్ వరకు రోడ్డుకిరువైపులా పూజా సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్డు కిటకిటలాడింది. తణుకు సొసైటీ రోడ్డులో చాక్లెట్ దండలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ దండలతో స్వామి అలంకరణ అనంతరం ప్రసాదం పంచుకునేందుకు వీలుగా ఉండడంతో కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆకివీడు మార్కెట్‌లో గణేశ్ ప్రతిమ, పూలు, పత్రి, పండ్ల ధరలు ఆకాశన్నంటడంతో భక్తుల జేబులకు చిల్లు పడింది. ఆచంట మండలంలో చవితి ఉత్సవాలకు నిర్వాహకులు మండపాలు ఏర్పాటు చేశారు. వినాయకుని ప్రతిమలు, పండ్లు, పువ్వులు, పత్రి కొనుగోలుతో గ్రామాల్లో సందడి నెలకొంది. చింతలపూడి పట్టణంలో బోసుబొమ్మ, గాంధీబొమ్మ సెంటర్లలో పలు దుకాణాలు వెలిశాయి. రంగురంగుల ప్రతిమలు, మట్టి వినాయకులు, పాలవెల్లులు, పూల దుకాణాలు, పండ్ల దుకాణాలతో రద్దీ నెలకొంది. కొయ్యలగూడెం మండలంలో చవితి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబ య్యాయి. ప్రధాన సెంటర్ పూజా సామగ్రి దుకాణాలతో రద్దీగా మారింది.

4.30 గంటలకు

ద్వారకాతిరుమల: శ్రీవిశ్వావసు నామసంవత్సర భాద్రపద శుద్ధ చవితి బుధవారం ఉదయం 4.30 గంటల నుంచి గణపతి పూజ చేసేందుకు శుభప్రదంగా ఉందని పండితులు చెబుతున్నారు. సెప్టెంబరు 7న ఆదివారం రాత్రి 9.56 గంటల నుంచి చంద్రగ్రహణం. 13, 21 రోజులు వినాయక ఉత్సవాలు నిర్వహించడం సాధ్యం కాదని పండితులు గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ చెబుతున్నారు. నవరాత్రులు చేసుకోవచ్చని వివరించారు.

ఉచిత విద్యుత్

వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు విద్యుత్ ఖర్చు ఎక్కువ. ప్రభుత్వం వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించడంతో మండపాల వద్ద ఉత్సవ నిర్వహణలో ఆర్థిక భారం తగ్గనుంది. పెద్ద మండపాలకు భారీ కటౌట్లు, విద్యుద్దీపాలకంరణ చేశారు. గ్రామాల్లో డీజే సౌండ్స్, మైక్‌సెట్లతో వినాయక చవితి మండపాల వద్ద సందడి కనిపిస్తోంది. ముందుగా అనుమతి తీసుకోవడంతో విద్యుత్ ఉచితం కానుంది.

ఏలూరులో భారీ మట్టి విగ్రహాలు

ఏలూరు ప్రధాన సెంటర్లలోని గణేశ్ మండపాల్లో భారీ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈ మట్టి విగ్రహాలను ఆయా మండపాల్లో ఏర్పాటు చేస్తున్నారు. తంగెళ్లమూడిలో 12 అడుగులు, రామకోటి, కుండీ సెంటర్లలో 25 అడుగుల భారీ వినాయక విగ్రహాలను మట్టితో ఏర్పాటు చేశారు.

అమ్మవారే మట్టికి ప్రాణం పోశారు

పంచభూతాలలో నేల ఒకటి. సాక్షాత్తూ పార్వతీ దేవి అమ్మవారు మట్టి విగ్రహాన్ని చేసి ప్రాణం పోశారు. ఇదే వినాయక జననం. పంచ భూతాల స్వరూపమే పరమేశ్వరుడు. పార్వతీ పరమేశ్వరుని తనయుడైన వినాయకుడిని మట్టితో పూజించాల్సిన అవసరం ఉంది.

- జంధ్యాల కళ్యాణశ్రీ, ఏలూరు


కొయ్యలగూడెంలో విద్యుత్ వెలుగులు


చింతలపూడిలో పూజా సామగ్రి దుకాణాలు


తాడేపల్లిగూడెంలో పూల దుకాణం

పత్రికి పన్ను పోటు

పాలకొల్లు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పూజలకు అవసరమైన పండ్లు, పత్రి, పూలు, మట్టి వినాయక విగ్రహాలు, ఇతర పూజా సామగ్రి విక్రయానికి చిరు వ్యాపారులు పట్టణ ప్రధాన కూడళ్లు, రోడ్డు మార్జిన్లలో దుకాణాలు ఏర్పాటు చేశారు. రోడ్డు మార్జిన్‌లో విక్రయించే వస్తువులకు పన్ను ఉన్నప్పటికీ, పూజ పత్రికి పన్ను మినహాయింపు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మామిడి, మారేడు, జిల్లేడు, మందార, గన్నేరు, వంటి పత్రి, గరిక, తామర, కలవ పూలు తీసుకువచ్చి అమ్ముకుంటారు. ఒక దుకాణంలో రోజంతా కష్టపడి పత్రి అమ్మితే గరిష్ఠంగా రూ.600 నుంచి 800 వస్తుంది. మునిసిపల్ ఆశీలు గెజిట్‌లో పత్రికి పన్ను లేదని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ దుకాణదారుల నుంచి పాటదారులు అక్రమంగా పన్ను వసూలు చేస్తున్నారు. ఈవిషయాన్ని బాధితులు మునిసిపల్ కమిషనర్ విజయసారథి దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే కమిషనర్ స్పందించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్లు కలెక్టర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి పన్ను వసూళ్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినప్పకీ ఆశీలు పాటదారులు అక్రమంగా దుకాణానికి రూ. 50 నుంచి రూ100 వరకూ పన్ను వసూలు చేయడంతో చిరు వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

కొనుగోలుదారులు లబోదిబో

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో రహదారుల పక్కన సంచార వ్యాపారులు పూలు, పండ్లు, పత్రి, విగ్రహాలు విక్రయాలకు దుకాణాలు ఏర్పాటు చేశారు. భక్తిభావంతో భక్తులు కొనుగోలు చేయాలని వస్తే ధరలు అధికంగా చెబుతున్నారు. నిన్నటివరకు పది రూపాయలు ఉన్న పూలు, పండ్ల ధరలు అమాంతం పెంచేశారు. రెట్టింపు ధర వసూలు చేశారు. బత్తాయి, యాపిల్, అరటి పండ్ల ధరలతో కొనుగోలుదారులు లబోదిబోమన్నారు. జామ, వెలగ, తదితర కాయలు ఒక్కొక్కటి రూ.50 వరకు విక్రయించారు. మొక్కజొన్న కండె ఒకటి రూ.40 చొప్పున విక్రయించారు. ధరలు అధికంగా ఉన్నా కొనుగోలు చేయకతప్పడంలేదని భక్తులు వాపోతున్నారు. పండ్ల ధరలు గణనీయంగా పెంచడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. పండుగను ఆసరాగా చేసుకుని దోచేశారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. మంగళవారం ఒక మోస్తరుగా వ్యాపారాలు కొనసాగాయి. అధిక ధరలు వసూలు చేశారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం ఈ సంచార వ్యాపారులు పండ్లు, పత్రి, పువ్వులు, పూజా సామగ్రి విక్రయించేందుకు జోరుగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. అన్ని చోట్ల అధిక ధరలు ఉన్నాయని పలువురు వాపోయారు.



ఏలూరు మార్కెట్‌లో గణనాథుడికి రంగుల గొడుగులు



ఆకివీడు, ఏలూరులో కలువ పూలు, వెలగ పండ్ల అమ్మకం



పాలకొల్లులో రంగురంగుల గణేశ విగ్రహాలు

మట్టి ప్రతిమలనే పూజించండి : ఎంపీ మహేశ్

ఏలూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చవితి ఉత్సవాల్లో మట్టి గణపతి ప్రతిమలను పూజించాలని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ సూచించారు. ఈ వినాయక చవితి ప్రజల జీవితాల్లో మరిన్ని సుఖ సంతోషాలు తీసుకురావాలని కోరుకుంటూ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలను ఆయన తెలిపారు. గణపతి ఆశీర్వాదంతో గత ఏడాది నుంచి ఏలూరు పార్లమెంట్ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోగలిగామని, రాబోయే రోజుల్లో మరిన్ని పనులు పూర్తి చేస్తామన్నారు,

సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు : ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయచవితి సందర్భంగా పోలీస్ సిబ్బందికి ఎస్పీ కేపీఎస్.కిశోర్ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడు అందరికి ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. వినాయక చవితి పండుగను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. వేడుకల్లో భద్రత నిబంధనలు పాటించి, పర్యావరణానికి హాని కలగకుండా విగ్రహాలను ప్రతిష్ఠించి, నదుల్లో, నీటి వనరుల్లో నిమజ్జనం బాధ్యతగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.


పట్టిసీమ ఫెర్రీ వద్ద పోలీసుల హెచ్చరిక బోర్డులు

గోదావరి రేవుల వద్ద జాగ్రత్త

పోలవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో గణనాథుల విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేకంగా వినియోగించే పట్టిసీమ ఫెర్రీ, ఇతర రేవుల వద్ద పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ పవన్ కుమార్ మాట్లాడుతూ గణపతి నవరాత్రులలో నిమజ్జనాలు జరిగే సందర్భాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులకు సూచనలు హెచ్చరికలు ఇవ్వడం జరిగిందని, ఫెర్రీ రేవుల వద్ద షిఫ్టులవారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఎర్ర కాలువ జలాశయం వద్ద..

జంగారెడ్డిగూడెం: ఎర్రకాలువ జలాశయంలో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ కె.స్లీవజోజి సూచించారు. ఎర్రకాలువ జలాశయం వద్ద చేస్తున్న ఏర్పాట్లు మంగళవారం పరిశీలించారు. జలాశయం వద్దకు విగ్రహాలతో పాటు పిల్లలను, మహిళలను తీసుకురావద్దని సూచించారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, గజఈతగాళ్లను ఉంచాలని, ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు.


ఆర్యన్ ఉభయ్‌ను సన్మానిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

విద్యార్థులు అద్భుత విజయాలు సాధించాలి

స్వర్ణాంధ్ర విద్యార్థులతో లండన్ డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉభయ్

నరసాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అద్భుత విజయాలు సాధించాలని, మనం సాధించిన విజయాన్ని మనం చెప్పుకోకూడదు.. నలుగురు చెప్పుకుంటేనే నిజమైన విజయమని లండన్ రాయల్ బారోటి డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉభయ్ అన్నారు. స్వర్ణాంధ్ర కాలేజీలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి విద్యార్థికి చదువుతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరమన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికతో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఎదుట వారిని ఎప్పుడు తక్కువగా అంచనా వేయరాదన్నారు. వివిధ రంగాల్లో రాణించిన వారిని స్ఫూర్తిగా తీసుకుని వారిలా ఎదిగేందుకు ప్రయత్నించాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగం సాధించాలంటే కచ్చితంగా ప్రతిభతో పాటు స్కిల్స్, ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా ఉండాలన్నారు. మంచి ఆహార అలవాట్లను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. చేసే పనిలో స్వల్ప కాలిక ప్రయోజనాలతో సంతృప్తి చెందరాదన్నారు. ఎప్పుడు లాంగ్ టర్మ్ విజన్ కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. చైర్మన్ కె.సత్యనారాయణ, త్రినాథ్, శ్రీహరి, కీర్తి, బాబు, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, గోపిచంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఒప్పంద కార్యక్రమంలో ఏపీనిట్ డైరెక్టర్ రమణారావు, నామ్‌టెక్ ప్రతినిధులు

నామ్‌టెక్‌తో ఏపీ నిట్ ఒప్పందం

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌కు చెందిన నామ్‌టెక్ స్టీల్ ఇండియాతో ఏపీ నిట్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎస్వీ రమణరావు, నామ్‌టెక్ ప్రోగ్రాం డైరెక్టర్ కేసీ వీర ఒప్పంద పత్రాలపై మంగళవారం సంతకాలు చేశారు. ఇన్‌చార్జి డైరెక్టర్ రమణారావు మాట్లాడుతూ స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, మొబిలిటి, రోబోటిక్స్, స్పేస్ అండ్ డిజిటల్ టెక్నాలజీ, కృత్రిమ మేధ వంటి సాంకేతిక రంగాలలో పరస్పర సహకారం అందించుకునేందుకు మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా మిషన్లు బలోపేతం చేసేందుకు ఈ ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వీటితో పాటు పరిశోధనలు, ఇన్నోవేషన్లు సంయుక్తంగా నిర్వహించడానికి పాఠ్య ప్రణాళిక, పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా కరికులం రూపకల్పన, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు, స్టార్టప్‌లు, మెంటరింగ్, హ్యాకథాన్ నిర్వహించడానికి విద్యార్థులు నామ్‌టెక్ ఫెలోషిప్ పొందడానికి కూడా దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డీన్ జి.రవికిరణ్‌శాస్త్రి, నామ్‌టెక్ ప్రోగ్రాం డైరెక్టర్ వాసు వెలగపూడి, అసోసియేట్ డైరెక్టర్ అమిత్ పటేల్, నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు వి.సందీప్, హిమబిందు, వీరేశ్‌కుమార్, కార్తీక్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.


బాస్కెట్‌బాల్ బాలికల జట్టు

బాస్కెట్‌బాల్ విజేత ఏలూరు జిల్లా జట్టు

ఏలూరు రూరల్, ఆగస్టు 26, (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శాప్ ఆధ్వర్యంలో అమరావతి ఛాంపియన్‌షిప్ కప్ పేరుతో ప్రతిష్ఠాత్మకంగా క్రీడా పోటీలను నిర్వహిస్తోంది. బాస్కెట్‌బాల్ విభాగంలో జోన్ 2 ఫైనల్ పోటీలు చిత్తూరు జిల్లా తిరుపతిలో జరిగాయి. బాలికల విభాగంలో ఏలూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఛాంపియన్‌షిప్ ట్రోఫీని ఈనెల 29న విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో అందుకుంటారు.

క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, ఆగస్టు 26, (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే సెంట్రల్ జోన్ అంతర జిల్లా క్రికెట్ పోటీలకు అండర్-23 విభాగం క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు ఎస్‌కె షాకీర్ హుస్సేన్ తెలిపారు. డీకే రేవంత్ నాగ కుమార్ (కెప్టెన్), పి.భువనేశ్వర్ (వైస్ కెప్టెన్), కెకెఎస్ఎన్.హరీష్ (కీపర్), వీఎంవీఎస్ రక్షణ్, కె.జాన్ రిచర్డ్స్, వి.జస్విన్, ఎం.హర్షవర్ధన్, జి.దీపక్ చంద్, జి.చరణ్ సాయితేజ, ఎం రిత్విక్, మెహబూబ్ ఆలీ, చైతన్యకుమార్, బి.సాయి సుషానిన్, పార్థర్ శ్రీసాయి, వి.లోహిత్, కెఎస్ఎన్.రాజు, స్టాండ్‌బైగా ఆర్.కేశవ, డి యశ్వంత్, ప్రణీత్ పవన్, వి.జయంతి సాయి ఎంపియ్యారు.

వైద్య సేవలందిస్తా రండి..

మైక్ చేతబట్టి మరీ పిలుస్తున్న ప్రభుత్వ వైద్యుడు

సిబ్బందితో కలిసి గిరిజన గ్రామాల్లో శిబిరాలు



మైక్ పట్టుకుని గిరిజనులను పిలుస్తున్న డాక్టర్ గణేశ్

వేలేరుపాడు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో మారుమూల ప్రాంతం కోయిదా. అన్నీ గిరిజన గ్రామాలే.. నాలుగు గ్రామాలకు అసలు దారే లేదు. గిరిజనులకు సకాలంలో వైద్య సేవలందక ఇబ్బంది పడుతున్నారు. వారి చెంతకు వెళ్లి సేవలందిస్తూ వైద్య వృత్తికే వన్నె తెస్తున్నారు ప్రభుత్వ వైద్యుడు గణేశ్. పీహెచ్‌సీ వైద్యాధికారిగా పని చేస్తున్న గణేశ్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. డాక్టర్ గణేశ్ వైద్య సిబ్బందిని వెంటపెట్టుకుని ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి తాము వచ్చిన విషయం అందరికి తెలిసేలా స్వయంగా మైకు చేతపట్టుకుని ఇళ్ల వద్దకు తిరుగుతున్నారు. శిబిరం వద్దకు వచ్చి వైద్య సదుపాయం పొందాలని ప్రజలను స్వయంగా కోరుతున్నారు. మైకు ద్వారా ప్రచారం చేయడంతో పొలం పనిలో ఉన్నా గిరిజనులు గ్రామంలోకి వచ్చి ఇళ్లల్లో బాగాలేనివారికి వైద్యం చేయిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లినా సక్రమంగా వైద్య సేవలందని రోజుల్లో ఒక ప్రభుత్వ వైద్యుడు గ్రామంలో తిరుగుతూ వైద్యం అందించడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.



వడ్డి కార్పొరేషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మిని అభినందిస్తున్న నేతలు

వడ్డి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా

వెంకటలక్ష్మి ప్రమాణస్వీకారం

దెందులూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ వడ్డి సంక్షేమ కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా ఘంటసాల వెంకటలక్ష్మి ప్రమాణస్వీకారం చేశారు. మంగళగిరిలోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో జెఎండీ జి.ఉమదేవి మంగళవారం వెంకటలక్ష్మితో ప్రమాణం చేయించారు. బాధ్యతలు చేపట్టిన వెంకటలక్ష్మి మాట్లాడుతూ 2019 లో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సీటు కేటాయించారని, ఇప్పుడు వడ్డి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించిన డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తాని తెలిపారు. కొల్లేరులంక గ్రామాలతో పాటు రాష్ట్రంలోని వడ్డి కులస్తుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. పలువురు నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నకిలీ వైద్యులను పట్టుకోడానికి ప్రత్యేక డ్రైవ్

ముగిసిన ఆయుష్ మేళా



లైసెన్సుల నవీకరణపత్రాలను అందజేస్తున్న ఆయుష్ శాఖ డైరెక్టర్లు

ఏలూరు అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నిర్దిష్ట విద్యార్హతలు, వృత్తి నైపుణ్యం, ప్రభుత్వ అనుమతి లేకుండా ఆయుర్వేద, హోమియో, యునాని వైద్యంచేసే నకిలీలను పట్టుకోడానికి ప్రత్యేక డ్రైవ్ చేపడతామని ఆయుష్ విభాగాల రాష్ట్ర అడిషినల్ డైరెక్టర్లు సాయి సుధాకర్, సుజాత, వై.శేఖర్ వెల్లడించారు. జోన్-2 పరిధిలోని ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణాజిల్లాల్లోని ఆయుర్వేద, హోమియోపతి ఉత్పత్తుల తయారీయూనిట్లు, రిటైల్ మందుల దుకాణాలకు కొత్తగా మాన్యుఫాక్చరింగ్ అనుమతులు, లైసెన్సుల రెన్యువల్స్‌నిమిత్తం ఏలూరు రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో రెండురోజులుగా నిర్వహిస్తోన్న ఆయుష్ మేళా మంగళవారం ముగిసింది. జోన్లవారీగా లైసెన్సుల జారీ, రెన్యువల్స్ మేళా ముగిసిన తర్వాత జిల్లాల్లో తనిఖీలు చేపట్టి నకిలీ వైద్యులు, అర్హతలు లేకుండా రిటైల్ మందుల దుకాణాలు నిర్వహిస్తోన్న వారిని పట్టుకుని కేసులు నమోదుచేస్తామన్నారు. కల్తీ ఆయుర్వేద, హోమియోపతి మందులను విక్రయిస్తున్నవారికి నోటీసులు జారీ, పెద్దమొత్తంలో వాటిని సీజ్‌చేసి జరిమానా విధించడం జరుగుతోందన్నారు. బీహెచ్‌ఎస్, బీఫార్మసీ అర్హతలున్న టెక్నికల్ సూపర్‌వైజర్లు లేకుండా రిటైల్ మందుల దుకాణాలు నిర్వహించడం చట్టవిరుద్ధ అన్నారు. తప్పుడు ప్రచారం, ప్రకటనలపై సుమోటోగా కేసులు నమోదుచేస్తున్నామని వివరించారు. కొత్తగా లైసెన్సుల కోసం దరఖాస్తుచేసుకున్నవారికి సెప్టెంబరు మొదటివారంలో ఆయుష్ శాఖ డైరెక్టర్ ద్వారా అనుమతి పత్రాలు జారీఅవుతాయని తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, రామత్లేహి, లైకూర్ రెహమాన్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆయుర్వేద సీనియర్ మెడికల్ ఆఫీసర్ భాస్కర్, మూడుజిల్లాల తయారీయూనిట్ల యజమానులు, రిటైల్ వర్తకులు పాల్గొన్నారు.

11 నుంచి ఉమ్మడి జిల్లా కళా ఉత్సవ్

ఏలూరు అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 48 మండలాల ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు సెప్టెంబరు 11, 12 తేదీల్లో దూబచర్ల విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో జిల్లాస్థాయి కళాఉత్సవ్-2025 నిర్వహిస్తున్నట్టు డైట్ ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి మంగళవారం తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేయడానికి జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. గాత్ర సంగీతం, వాద్య సంగీతం, నృత్యం, నాటకరంగం, దృశ్య కళలు, సంప్రదాయ కథ చెప్పడం విభాగాల్లో పోటీలుంటాయన్నారు. సెప్టెంబరు 11న సంగీతం/నృత్యం, 12న నాటకం, డ్రాయింగ్, కథ చెప్పడం పోటీలు జరుగుతాయని వివరించారు. కళాంశాల్లో వ్యక్తిగత, గ్రూపు విభాగాల్లో పోటీలుంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే బాలబాలికలు వివరాలను ముందస్తుగా గూగుల్ ఫారంలో నమోదుచేయాల్సిఉంటుందని, వివరాలకు డైట్ లెక్చరర్లు రాజ్‌కుమార్ (89195 59615), శామ్యూల్ సంజీవ్(99123 08303)ను సంప్రదించాలన్నారు.

ఇండియా బుక్‌లో కొయ్యలగూడెం బాలుడు



గుర్తింపు పత్రంతో రియాన్ష్

కొయ్యలగూడెం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వైద్యుడు కొల్లూరి లక్ష్మణ్ కుమారుడు రియాన్ష్ జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు పొందాడు. 101 కౌరవ పేర్లు 48.10 సెకన్లలో చెప్పి జాతీయ రికార్డు నెలకొల్పాడు. హర్యానాకు చెందిన ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో రియాన్ష్ ప్రతిభ నమోదైంది. ఈ నెల 21న ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ అధికారిక ప్రకటన చేసింది. తమ కుమారుడికి చిన్నవయస్సులోనే జాతీయ గుర్తింపు రావడం సంతోషమని, భవిష్యత్‌లో మరిన్ని రికార్డులు సాధించడానికి ప్రోత్సహిస్తున్నామని తల్లిదండ్రులు కొల్లూరి లక్ష్మణ్, సౌభాగ్యలక్ష్మి తెలిపారు.

యాప్‌ల మాయ!



మానవుడు తన తెలివి తేటలను వినియోగించుకుని చందమామపైనే అడుగుపెడుతున్నాడు. 23 ఏళ్ల కిందట ల్యాండ్ లైన్ ఫోన్ స్థానంలో సెల్‌ఫోన్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. మొదట్లో టవర్లు ఉన్న ప్రాంతానికి సిగ్నల్ ఫ్రీక్వెన్సీ ఉండేది. ఆ తరువాత క్రమేపీ టవర్లు అందుబాటులోకి వచ్చాయి. 2జీగా వచ్చిన మొబైల్ 3జీ, 4జీగా మారుతూ ఇప్పుడు 5జీలో ఉంది. ఇంకోవైపు కీప్యాడ్ సెల్‌ఫోన్ నుంచి ఆండ్రాయిడ్, స్మార్టు ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. రోజురోజుకూ విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ సుఖజీవితాన్ని అనుభవించడానికి శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నారు. అన్నీ అరచేతిలోనే ప్రపంచ జ్ఞానాన్ని తెలుసుకునే విధంగా తన అవసరాలు తీర్చుకునేందుకు ఆ మొబైల్‌నే వినియోగిస్తున్నారు. దీనిలో భాగంగా అందరి అభిరుచులకు అనుగుణంగా యాప్‌లను తయారు చేస్తూ ఆ మొబైల్‌లో యాప్‌లను డౌన్‌లోడు చేసుకుని వాటికి బానిసలుగా మారే విధంగా కొన్ని యాప్‌లు ఉన్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఏలూరు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) :

బెట్టింగ్ యాప్‌లకు బలవుతున్న యువత

యువత అధికంగా వినియోగించే గేమింగ్ యాప్‌లు ప్రథమస్థానంలో ఉన్నాయంటే మొబైల్స్ వాడుతున్న వారు ఏ విధంగా గేమింగ్ యాప్‌లకు బానిసలు అవుతున్నారో అర్థం చేసుకోవచ్చు. విద్యార్థులు గతంలో నెట్ సెంటర్లకు వెళ్లి ఇంటర్‌నెట్‌లో గేమ్‌లు ఆడేవారు. అక్కడ నెట్ సెంటర్‌లో గంటకు కొంత నగదు చెల్లించేవారు. నేడు ఆ పరిస్థితులు మారిపోయాయి. ప్రతి ఒక్కరి చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటుంది. ఎదుటివారు మాట్లాడుతున్నా వారిని చూడకుండా వారి మాటలకు జవాబు చెబుతూనే ఫోన్‌ను చూస్తూనే అందులో గేములు ఆడుతున్నారు.

వందలాదిగా ఆన్‌లైన్ గేమ్‌లు

ఆన్‌లైన్ గేమ్‌లపై 2022లో జీఎస్టీ విధించి అధికారికంగా అనుమతులు ఇవ్వడంతో వందలాది గేమ్‌లు యాప్‌ల రూపంలో ప్లే స్టోర్‌లోకి వచ్చి చేరాయి. ఎవరికి నచ్చిన గేమ్‌ను వారు డౌన్‌లోడ్ చేసుకుంటూ ఆడుతున్నారు. వీటిలో బెట్టింగ్ గేమ్‌లు ఉండడంతో కాస్త ఆశతో ఒక రూపాయి సంపాదించవచ్చు నాలుగు కాసులు వెనుకేసుకోవచ్చని వారి తెలివితేటలను ఏకాగ్రత చేసి ఆ గేమ్‌లో గెలవవచ్చని ఆడుతున్నారు. బెట్టింగులు కడుతున్నారు. ప్రతి గేమ్‌లో బెట్టింగ్ గేమ్ ఆడేవారికి తొలుత పాయింట్లు ఇస్తూ గేములను గెలుస్తున్నారని సొమ్ములను పొందుతున్నారంటూ చూపిస్తారు.

» బెట్టింగ్ యాప్‌లపై నిషేధం విధిస్తూ పార్లమెంటులో బిల్లు ఆమోదం

అంతేకాకుండా ఆ సొమ్ములు 24 గంటల్లోనే అకౌంట్లో జమ కావడంతో ఇంకేముంది ఎంతో కష్టపడుతున్నామంటూ తమ తెలివితేటలతో సొమ్ములు సంపాదిస్తున్నామంటూ ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తూ ఈ గేములకు తమకు తెలియకుండానే బానిసలవుతున్నారు. విద్యార్థులే కాదు. యువతీ యువకులతో పాటు ఇళ్లల్లో ఉండే మహిళలకు కూడా వీటికి బానిసలు అవుతున్నారంటే ఆ బెట్టింగ్ యాప్‌ల ప్రభావం ప్రజలపై ఏవిధంగా పడుతుందో ఊహించలేం. ఎంతో మంది ఈ బెట్టింగులకు బానిసలై నేరస్తులుగా మారుతుండగా మరికొంత మంది ఈ బెట్టింగుల కోసం చేసిన అప్పులు తీర్చలేక ఏమి చేయాలో పాలుపోక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

మహిళలు సైతం..

ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఇతర సోషల్ మీడియాల్లో రకరకాల గేమ్‌లు రావడం వాటిలో పెట్టుబడులు పెడితే అమాంతంగా సొమ్ములు రెట్టింపు పెరుగుతాయంటూ వచ్చేయాప్‌ల్లో పెట్టుబడులు పెడుతూ వాటిలో కూడా చిన్న చిన్న గేములు ఆడితే ఆ సొమ్ములకు అదనంగా సొమ్ములు వస్తాయని చెప్పడంతో ఇళ్లల్లో ఉండే మహిళలు సైతం ఇలాంటి గేములను ఆడుతూ పెట్టుబడులు పెడుతున్నారు. సొమ్ములు ఎక్కువగా లక్షల్లో వచ్చినట్టుగా ఆన్‌లైన్ అకౌంట్‌లో చూపిస్తూ వాటిని పొందాలంటే జీఎస్టీ కట్టాలని, ఎంట్రీ ఫీజు కట్టాలని, సీఎస్టీ, జీఎస్టీలు కూడా చెల్లించాలని రకరకాల ఫీజుల పేరుతో దఫదఫాలుగా సొమ్ములను కట్టించుకుంటూ మోసం చేస్తున్నారు

ఏలూరు జిల్లా ఏలూరుకు చెందిన డిగ్రీ చదివిన విద్యార్థి ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగులు నిర్వహించి అప్పులపాలై చివరకు తీర్చే మార్గం కానరాక తన ప్రాణాన్ని అనంత వాయువుల్లో ఉరి రూపంలో కలిసిపోయాడు. ఇదేవిధంగా మరికొంతమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

ఏలూరు బీడీ కాలనీకి చెందిన ఒక యువతి ఆన్‌లైన్ గేములు ఆడడంతో ఆమె ఖాతాలోకి రూ.15 లక్షల వచ్చినట్టుగా చూపించారు. ఇవి పొందాలంటే అనేక రకాల టాక్స్‌లు కట్టాలని మూడు లక్షల 90 వేల రూపాయలు కట్టించుకుని మోసం చేశారు. బాధితురాలు లబోదిబో మంటూ ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బెట్టింగ్ యాప్‌లపై కేంద్రం నిషేధం

దేశంలో అనేకమంది ఈ యాప్‌లకు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని గుర్తించిన కేంద్రం పార్లమెంటులోనే బెట్టింగ్ గేమ్‌ల యాప్‌లపై నిషేధాన్ని విధిస్తూ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రమోట్ చేసిన వాటిని వినియోగించినా చట్ట ప్రకారం జరిమానాలతో పాటు జైలు శిక్ష విధించే విధంగా చట్టాన్ని రూపొందించారు. నిర్వాహకులకు ఏడేళ్ల వరకు శిక్ష పడేవిధంగా బిల్లులో పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధిస్తూ పార్లమెంటులో బిల్లును ఆమోదించడంతో దేశంలోని యువత సన్మార్గంలో నడిచేందుకు మార్గం ఏర్పడినట్లుగా చెప్తున్నారు.

బెట్టింగ్ యాప్‌ల జోలికి పోవద్దు



బెట్టింగ్ గేమ్స్ యాప్ వల్ల దేశానికి చాలా నష్టం. సైబర్ నేరగాళ్లు సైబర్ నేరాల్లో తస్కరించే సొమ్ములను ఈవిధమైన యాప్‌ల్లో గేమ్స్ ఆడేవారికి గిఫ్టులుగా సొమ్ములను అకౌంట్లకు ట్రాన్సఫర్ చేస్తూ ఉంటారు. తల్లిదండ్రులు తమ పిల్లలు మొబైల్‌లో ఆడే గేమ్స్‌పై దృష్టి పెట్టాలి. ఎవరైనా ఇలాంటి గేమ్స్ వల్ల నష్టపోయి ఆన్‌లైన్ మోసాలకు గురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

- కిశోర్, ఎస్పీ, ఏలూరు జిల్లా

యూరియా కోసం రైతుల పాట్లు



యూరియా కోసం గుమిగూడిన రైతులు

చింతలపూడి,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం చింతలపూడి మండలం యర్రంపల్లి సొసైటీ వద్ద రైతులు గుమిగూడారు. అసలే కొరతగా వున్న సమయంలో సొసైటీకి యూరియా వచ్చిందని తెలియడంతో సొసైటీ పరిధిలోని రైతులు ఒక్కసారిగా రావడంతో రద్దీగా మారింది. వ్యవసాయ శాఖ కేవలం వరి సాగు చేసే రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అదికూడా పట్టాదారు పాస్ పుస్తకం నమోదు చేసి ఒకటి, లేదా రెండు బస్తాలు మాత్రమే ఇవ్వాలని సూచనలు చేసింది. ఎరువుల కొరత విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. ఈనెల 30వ తేదీకి ఎరువులు వస్తాయని కలెక్టర్ తెలిపారని, రైతులు ఇబ్బంది పడొద్దని భరోసా ఇచ్చారు. యర్రం పల్లి సొసైటీలో రైతులు అధిక సంఖ్యలో రావడంతో సొసైటీ చైర్‌పర్సన్ టి.చంద్రశేఖరరెడ్డిని ప్రశ్నించగా తమ సొసైటీకి 12 టన్నుల యూరియా వచ్చిందని, ఒక బస్తా ఇస్తున్నామని చెప్పారు. రైతులందరూ ఒకేసారి రావడం వల్లే రద్దీ ఉందన్నారు.

ప్రభుత్వ పథకాలు సులభంగా పొందవచ్చు : జడ్జి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : అసంఘటిత కార్మికులు తమ వివరాలను ఈ-శ్రం పోర్టల్‌లో నమోదు చేసుకోవడం వల్ల కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలను సులభంగా పొందవచ్చని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. మంగళవారం ఏలూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో జంగారెడ్డిగూడెం స్నేహ మహిళా అభ్యుదయ సభ్యులకు బాల్య వివాహాలు వల్ల జరిగే నష్టాలతో పాటు అసంఘటిత కార్మికులు చట్టాలు, ఇతర మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు విశేషకృషి చేస్తున్నాయని అయినప్పటికీ నేటి సమాజంలో దురాచారాలు కొనసాగుతుండడం దురదృష్టకర మన్నారు. వీటిని అరికట్టడానికి విస్తృత ప్రచారం చేయడంలో భాగంగానే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి వ్యక్తికి స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని, ఆ హక్కులను భంగం కలిగించినప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించవచ్చన్నారు. మహిళలు పోషణకై ఎన్నుకున్న వేశ్య వృత్తి చేసే వారిపట్ల గౌరవ భావంతో ఉండాలని ఉన్నత న్యాయస్థానాలు సూచిస్తున్నాయన్నారు.

ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఎరువుల స్వాధీనం



ఎరువులు పరిశీలిస్తున్న అధికారులు

ఏలూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్తంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో ఏకకాలంలో ఎరువుల షాపులను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. నర్సాపురంలో శ్రీనివాస ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్‌లో 3.40లక్షల విలువైన 18.5 మెట్రిక్ టన్నుల ఎరువుల వ్యత్యాసంను గుర్తించారు. ఇదే ప్రాం తంలో సత్యలక్ష్మి వెంకటేశ్వర ట్రేడర్స్‌లో 2లక్షల91వేల విలువైన 8.1 మెట్రిక్ టన్నుల ఎరువుల వ్యత్యాసాలను గుర్తించారు. జంగారెడ్డిగూడెం మండలం పేరంపేటలో వాసవి జనరల్ స్టోర్స్‌లో 3లక్షల 79వేల 671 విలువైన 20.545 మెట్రిక్ టన్నులు, గాయత్రి ఎంటర్ ప్రైజెస్‌లో 96,100 విలువ కలిగిన 3.35 మెట్రిక్ టన్నుల వ్యత్యాసాలను గుర్తించి మొత్తం నాలుగు కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ డీఎస్పీ సింగలూరు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి శివరామకృష్ణ, ఏవో జి మీరయ్య, ఎస్‌ఐలు సీహెచ్ రంజిత్‌కుమార్, కె, నాగరాజు, కె.సీతారాములు పాల్గొన్నారు.

65 కేజీల గంజాయి స్వాధీనం



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

పెదపాడు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కిశోర్‌కు అందిన సమా చారం మేరకు పెదపాడు పోలీసులు తనిఖీలు నిర్వహించి 65 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్ ప్రసాద్ పర్యవేక్షణలో పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్, పెదపాడు ఎస్.ఐ. శారదా సతీష్‌లు తనిఖీలు చేపట్టి వ్యానులో అక్రమంగా తరలి స్తుండగా స్వాధీనం చేసుకున్నారు. పెదపాడు పోలీస్ స్టేషన్‌లో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్ ప్రసాద్ వివరాలు వెల్లడించారు. గంజాయిని రవాణా చేస్తున్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మహ్మద్ రాజు, మహ్మద్ ఇమ్రాన్‌లను అరెస్టు చేసి, వారివద్ద నుంచి సుమారు రూ.7 లక్షల విలువైన 65 కేజీల గంజాయి, వాహ నాన్ని, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

వివాహితను హతమార్చిన ఒకరికి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):ఒక వివాహితను లోబర్చుకుని వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఆమె మరొకరితో సన్నిహితంగా ఉంటోందనే అనుమానంతో హత్య చేసిన ఘటనలో ఒక యువకుడికి జీవిత ఖైదు, రూ.30 వేల జరిమానా విధిస్తూ ఏలూరులోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.రామకృష్ణరాజు మంగళవారం తీర్పు చెప్పారు. దెందులూరు మండలం పోతునూరు గ్రామానికి చెందిన తలారి రాజ్‌కుమార్(30) అదే గ్రామానికి చెందిన పద్మినితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కొంత కాలం తరువాత శ్రీను అనే యువకుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. విషయం తెలుసుకున్న రాజ్‌కుమార్ ఆమెను మందలించాడు. అయినప్పటికీ ఆమెలో మార్పురాకపోవడంతో హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆమెను నమ్మకంగా వేరే ప్రాంతానికి తీసుకెళ్లి 2018 అక్టోబర్ 22న నల్లజర్ల సమీపంలోని పామాయిల్ తోటలోకి తీసుకెళ్లి ఆమె చీరతోనే గొంతు నులిమి హతమామార్చి మృతదేహాన్ని తుప్పల్లో పడవేసి వెళ్లిపోయాడు. ఈ కేసులో రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసి భీమడోలు పోలీసులు కేసు నమోదు విచారణ చేపట్టారు.ఈ కేసు ఏలూరులోని ఒకటవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. నిందితుడైన రాజ్‌కుమార్‌పై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ జడ్జి ఎం.రామకృష్ణరాజు మంగళవారం తీర్పు చెప్పారు. ఈ కేసును దర్యాప్తు జరిపి నిందితుడికి శిక్ష విధించేందుకు కృషి చేసిన పోలీసులను ఎస్పీ కెపిఎస్ కిషోర్ అభినందించారు.

ఆటోలకు క్యూఆర్ కోడ్‌లు

ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఏర్పాటు - ఆటో రికార్డులు సక్రమంగా ఉన్న వారికి ఏర్పాటు



క్యూఆర్ కోడ్ స్టిక్కర్ అంటిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : ఆటోల్లో ప్రయాణికులకు, ప్రజలకు భద్రత పెంపొందించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏలూరు నగరంలో ఉన్న ఆటోలకు ట్రాఫిక్ పోలీస్ క్యూ ఆర్ కోడ్ కలిగిన డిజిటల్ స్టిక్కర్లను, డ్రైవర్లకు ఐడెంటిటీ కార్డులను ఎస్పీ మంగళవారం మధ్యాహ్నం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆటోల్లో ప్రయాణం చేసే ప్రజలకు సురక్షిత ప్రయాణం కోసం ఈ క్యూ ఆర్ కోడ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏలూరు నగరంలో నాలుగు వేల ఆటోలు ఉండగా, రెండు వేల ఆటోలకు ఇప్పటి వరకూ పోలీస్ డిజిటల్ క్యూ ఆర్ కోడ్, ఐడెంటీ కార్డులను అందజేశామని అన్నారు. మిగిలిన ఆటోలకు కూడా ఈ ప్రక్రియ సెప్టెంబర్ నెలాఖరులోపు పూర్తవుతుందని, ప్రతి ఆటో డ్రైవర్ ఆటోకు సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులను ట్రాఫిక్ పోలీసులకు అందించి క్యూఆర్ కోడ్‌ను పొందాలన్నారు. ఆ తరువాత స్పెషల్ డ్రైవ్ చేపట్టి నిబంధనలు ఉల్లంఘించిన ఆటో డ్రైవర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. క్యూఆర్ కోడ్‌ను తమ ఫోన్‌లో స్కాన్ చేస్తే ఆటో నెంబర్, ఆటో డ్రైవర్ పేరు, ఫోన్ నెంబరు వివరాలు వస్తాయన్నారు. ఏమైనా లగేజీలు మర్చిపోయినా ఆ నెంబర్ ద్వారా వెంటనే సంప్రదించవచ్చన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఆటోల వివరాలను క్షణాల్లో తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ ఉపయోగపడుతుందన్నారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుందన్నారు. కొన్ని ఆటోలు సరైన రికార్డులు లేకుండా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్న సమయాల్లో బాధితులకు ఇన్సూరెన్స్, నష్టపరిహారం రాకుండా పోతుందన్నారు. దీని వల్ల ఎన్నో కుటుంబాలు ఇబ్బందుల పాలవుతూ దిక్కులేనివిగా మారిపోతున్నాయన్నారు. ఖచ్చితమైన రికార్డులు, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సులు ఉన్న ఆటోలకు మాత్రమే క్యూఆర్ కోడ్ జారీ చేస్తున్నామన్నారు. క్యూఆర్ కోడ్ లేకుండా తిరిగే ఆటోలపై చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ సీఐ లక్ష్మణబాబు, త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, టూటౌన్ సీఐ కె అశోక్ కుమార్, ఆటో యూనియన్ నాయకులు లీలా కృష్ణ, సూరిబాబు పాల్గొన్నారు.

రోడ్డుపై మోటారు సైకిల్‌పడి దగ్ధం



దగ్ధమవుతున్న మోటార్ సైకిల్

ఏలూరు క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న మోటార్ సైకిల్ అదుపు తప్పి రోడ్డుపై పడి ఈడ్చుకుంటూ వెళ్లడంతో నిప్పురవ్వలు చెలరేగి ఆ మోటారు సైకిల్ దగ్ధమైంది. కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం మనివేశ్వరం గ్రామానికి చెందిన మీడా కిశోర్ బాబు తన స్నేహితులతో కలిసి మోటారు సైకిల్‌పై ఏలూరు నుంచి కలపర్రు వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితులు నిస్సహాయ స్థితిలో అలాగే ఉండిపోయారు.

యూరియాకు ప్రత్యామ్నాయంగా సల్ఫేట్ వాడండి

» రైతులకు అధికారుల సూచనలు

పెదవేగి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): యూరియాకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ తోటలకు అమోనియం సల్ఫేట్ అమోఘంగా పని చేస్తుందని వ్యవసాయ శాఖ ఏలూరు సహాయ సంచాలకుడు సంతోష్ అన్నారు. పెదవేగి మండలం వంగూరు, జగన్నాథపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోందని కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సహాయ సంచాలకుడు సంతోష్ మాట్లాడుతూ యూరియాతో పంటల దిగుబడి బాగుంటుందనే ఆలోచనతో రైతులు ఉన్నారని, కానీ దానికి ప్రత్యామ్నాయంగా అమ్మోనియం సల్ఫేట్ మెరుగైన ఫలితాన్నిస్తుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు అమ్మోనియం సల్ఫేట్‌ను వాడి అధిక దిగుబడులను సాధించాలన్నారు.రసాయనిక ఎరువుల వాడకంతో భూమి జీవాన్ని కోల్పోతుందని అన్నారు. అనంతరం రైతులకు జీవన ఎరువులను పంపిణీ చేశారు.

చెల్లని చెక్కు కేసుల్లో ఇద్దరికి జైలు

నూజివీడు టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బాకీ నిమిత్తం చెల్లని చెక్కులు అందజేసిన ఇద్దరికి నూజివీడు ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. మండలంలోని రావిచర్లకు చెందిన పురాణం రామలక్ష్మి, నూజీవీడుకు చెందిన మద్దిరాల కోటేశ్వరరావు నుంచి రూ.5 లక్షలు అప్పుగా తీసుకుంది. బాకీ నిమిత్తం చెక్కు ఇవ్వగా బ్యాంకులో చెల్లలేదు. దీనిపై అతడు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా విచారణ జరిపి ఆరు నెలల జైలు, జరిమానా విధించారు. మరో కేసులో నూజీవీడుకు చెందిన నెల్లిమర్ల విఘ్నేశ్వరరావు, అదే గ్రామానికి చెందిన పెనిమల నాగమల్లేశ్వర రావుకు రూ.7 లక్షలు అప్పుగా ఇచ్చారు. నాగమల్లేశ్వరరావు రూ.6 లక్షలకు చెక్కు ఇవ్వగా చెల్లక పోవడంతో ఆరు నెలల జైలు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మోటార్ సైక్లిస్టు మృతి

పెనుగొండ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిలిస్టును కూల్‌డ్రింక్ వ్యాన్‌బలంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ గంగాధరరావు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పెనుగొండ మండలం మునమర్రు గ్రామానికి చెందిన తానేటి సత్యానందం(37) తన మోటారు సైకిల్‌పై పెరవలి వెళ్తుండగా పెనుగొండలోని ఇండియన్ గ్యాస్ గొడౌన్ సమీపంలో నరసాపురం-నిడదవోలు మెయిన్ రోడ్డుపై కూల్ డ్రింక్స్ వ్యాన్‌ను నడుపుతున్న డ్రైవర్ అతి వేగంగా నిర్లక్ష్యంగా నడిపిన కారణంగా ఎదురుగా వస్తున్న సత్యానందాన్ని బలంగా ఢీ కొట్టింది. దీంతో సత్యానందం తలకు బలమైనగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి మామ అయిన దిగమర్తి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.సత్యానందానికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఐరన్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

దైవ దర్శనానికి వెళ్లి అదృశ్యం



ఏలూరు క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి దర్శనానికి వెళ్లి తిరిగి రైల్లో వస్తుండ గా ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ వద్ద ఆ మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటనపై బంధువులు ఏలూరు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పాతర్లపల్లి గ్రామానికి చెందిన గొర్లెల రూపమ్మ(50) తన కుటుంబ సభ్యులతో తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లి తలనీలాలను అర్పించుకుంది. తిరిగి రైల్లో కుటుంబ సభ్యులతో వెళ్తుండగా ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ వద్ద ఆమె రైలు దిగింది. ఆతరువాత ఆమె కనిపించడం లేదు. ఈ సంఘటనపై ఏలూరు రైల్వే పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ వలలో బీటెక్ విద్యార్థిని

ఏలూరుక్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో బీటెక్ విద్యార్థి పడి మోసపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ ఇన్‌చార్జి ఎస్‌ఐ బి.నాగబాబు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్లలంక గ్రామానికి చెందిన పూడి జ్యోతిక్(19)బీటెక్ చదువుతున్నాడు. జ్యోతి మొబైల్‌లో వాట్సాప్‌కు ఇండియన్ స్టాక్ మార్కెట్ పేరుతో మెస్సేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేస్తే సొమ్ము రెట్టింపు అవుతుందని నమ్మబలకడంతో దఫదఫాలుగా రూ. లక్షా 8 వేల 929 పెట్టుబడిగా పెట్టాడు. అయితే ఆ సొమ్ములు రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి ఈ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌పై ఏలూరు రూరల్ పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాట్సాప్‌లకు వచ్చే మెసేజ్‌ల పట్ల అలర్ట్‌గా ఉండాలన్నారు.

విద్యార్థులకు వస్త్రాలు, నిత్యావసరాల అందజేత

భీమడోలు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): భీమడోలులో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భీమడోలోలని జడ్పీ హైస్కూల్లో 50 మంది విద్యార్థులకు మానస పదవ తరగతి విద్యార్థుల ఆర్థిక సహాయంతో సమకూర్చిన దుస్తులు, దుప్పట్లు, నిత్యావసర వస్తువులు, అత్యవసర మందులు అందజేశారు. విద్యార్థుల దాతృత్వాన్ని ప్రిన్సిపాల్ యలమర్తి రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు, రేవతిదేవి, లావణ్య, కవిత కొనియాడారు. భీమడోలు సామాజిక విద్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సాకు నివాళులర్పించారు.

ఘనంగా బిషప్ జయరావు జన్మదిన వేడుక

పెదవేగి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర జన్మదిన వేడుకలు పెదవేగి మండలం విజయరాయిలోని జైసాల్ శిక్షణ కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో కలసి బిషప్ జయరావు కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు సాంఘిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో జైసాల్ కేంద్రంలోవివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో దంతవైద్య కళాశాలను ఏర్పాటు చేశామన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చింతలపూడి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యానవన శాస్త్రం, గణితశాస్త్రం బోధించడానికి అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుపై పీజీలో 50 శాతం ఉత్తీర్ణత గల వారు తమ దరఖాస్తులను కళాశాల కార్యాలయానికి 30వ తేదీలోగా అందజేయాలన్నారు. పీహెచ్‌డీ, ఎంఫిల్ అర్హత గల వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సెప్టెంబర్ 4న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు.

రైతులకు సబ్సిడీపై డ్రోన్లు అందజేత

ఉంగుటూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునికత వైపు మారాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కిసాన్ డ్రోన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా రాయితీ రూ.7,80,000 కాగా లబ్ధిదారు గ్రూపునకు రూ.2 లక్షలు చెల్లించాలని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ వివరించారు. నానో ఎరువులు డ్రోన్ల ద్వారా పిచికారి చేయవచ్చన్నారు.రెండు గ్రూపులు అడపా శోభారాణి, బీరా చక్రధర్‌లకు పంపిణీ చేశామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అయ్యప్ప, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు, జనసేన, టి.డి.పి. మండలాధ్యక్షులు పంది రాంబాబు, వేములపల్లి సుధీర్, చేబ్రోలు సొసైటీ అధ్యక్షులు కడియాల రవిశంకర్, పాతూరి విజయ్‌కుమార్, సొసైటీ డైరెక్టర్ బాల భాస్కర్,ఇమ్మణ్ణి గంగాధరరావు, గోపినాథపట్నం టీడీపీ గ్రామాధ్యక్షులు బీరా పెద్దిరాజు పాల్గొన్నారు.

సర్‌ప్లస్ సీఎంఆర్టీలను వేరే జిల్లాలకు కేటాయించొద్దు

ఏలూరు అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్వ్యవస్థీకరణ తర్వాత మిగులు(సర్‌ప్లస్) సీఎంఆర్టీలుగా మిగిలిపోయిన వారిని అదే మండలం లేదా సమీప మండలాల్లో సర్దుబాటుచేయాలని ఎంఈవో-2ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.వి.రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న పరిచయాలను పాఠశాలల అభివృద్ధికి వినియోగించుకోవడానికి సాధ్యమైనంతవరకు వారిని ఆయా ప్రాంతాల్లోనే విధులు కేటాయించాలని కోరారు. సర్‌ప్లస్ సీఎంఆర్టీలను ఇతర జిల్లాలకు కేటాయించాలనే ప్రతిపాదనలను విరమించుకోవాలన్నారు.

రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ వర్క్‌షాపు

పెదపాడు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఐటీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల లీన్ స్టార్టప్ ఫండమెంటల్స్ అనే అంశంపై వర్క్‌షాపు మంగళవారం జరిగింది. ఇందులో కనిష్ఠ ఆచరణీయమైన ఉత్పత్తి సృష్టి అనే అంశంపై బూట్ క్యాంప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫ్రాంక్లిన్ టెక్ సిస్టమ్స్ ఎండీ ఆర్.శివకుమార్ పాల్గొని ఆధునిక వ్యవస్థాపనలలో పర్యావరణ ప్రాముఖ్యత, దాని నష్టనివారణను తగ్గించడంలో బిల్డ్, మెజర్, లెర్న్ సైకిల్‌ల పాత్రను విశిదికరించారు. కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, కొండా హరిరామకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు, ఐటీ హెచ్‌వోడీ డాక్టరు కె.సత్యనారాయణ, కో-ఆర్డినేటర్లు కృష్ణవేణి, రామయ్య చౌదరి పాల్గొన్నారు.

సాంకేతిక నిపుణుల సాధికారిత అంశంపై వర్క్‌షాప్

నవకల్పన, వ్యవస్థాపనలతో సాంకేతిక నిపుణుల సాధికారిత అనే అంశంపై ప్రేరణాత్మక వర్క్‌షాపును మంగళవారం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన ఎం.ఎస్.ఎం.ఈ టెక్నాలజీ హెచ్‌వోడీ డాక్టరు కె.మురళీకృష్ణ పాల్గొని విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. నూతన ఆవిష్కరణల ఆవశ్యకత, ప్రభుత్వ సహకారం, నిధుల మంజూరు, సృజనతతో కూడిన వ్యాపారాలను ఎలా ప్రారంభించాలనే అంశాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై జిల్లా అధికారుల పర్యవేక్షణ

ఏలూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టడంపై అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు దృష్టిసారించాలని ఏలూరు జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీహరి అన్నారు. లింగపాలెం మండలంలోని యడవల్లి గ్రామంలో ఎంపీడీవో కె.వాణితో కలిసి పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న శానిటేషన్ పనులను గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ఐవీఆర్ఎస్ కాల్స్, తడిచెత్త-పొడిచెత్తపై ప్రజలలో చైతన్యం కలిగించేలా అవగాహన కల్పించారు. డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి, పంచాయతీ కార్యదర్శులు బి.బాలకృష్ణ, ఎం.సుగుణరాజు, సి.హెచ్.రాజు పాల్గొన్నారు.

మాధవ్ పర్యటన సన్నాహక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకురాలు

కామవరపుకోట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఏలూరు జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు ఎస్.ఆర్.ఆర్.ఎల్.ఎస్.ఎన్. రాజు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 3న జరిగే పర్యటన నిమిత్తం మంగళవారం కామవరపుకోట బీజేపీ మండల కార్యాలయం వద్ద సన్నాహ సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి పీవీ రామలక్ష్మి అధ్యక్ష తన సమావేశం జరుగుతుందన్నారు. సన్నాహక కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్య వర్గ సభ్యులు బాహుబలెంద్రుని బాలవర్ధి రాజు, సీనియర్ బీజేపీ నాయకులు కాకి సురేష్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల లక్ష్మి, సీనియర్ నాయకులు నల్లూరి శివరామకృష్ణ, కిసాన్ మోర్చా అధ్యక్షులు ఘంటా సురేష్ కుమార్, యువ మోర్చా మండల ప్రెసిడెంట్ నందూరి భాను(భావనచార్యులు) పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : సీఐటీయూ

పెదపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయని పక్షంలో పెద్దఎత్తున కార్మిక పోరాటాలు నిర్వహించాల్సి వస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ తెలిపారు. సీఐటీయూ మహాసభ పెదపాడులో మంగళవారం జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసే అధికారం మోదీకి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. పెరిగిన ధరలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ఆటో, హమాలి తదితర అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీ బాలికలకు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఎస్టీ బాలికల హాస్టల్‌కు చెందిన 13 మంది విద్యార్థినులకు ఏక కాలంలో టైఫాయిడ్ జ్వరాలు సోకడంతో వెంటనే హాస్టల్‌లో వైద్యశిబిరం ఏర్పాటు చేసి మిగిలిన పిల్లలకు కూడా పరీక్షలు నిర్వహించాలని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇభూషణం డిమాండ్ చేశారు. మంగళవారం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పీడీఎస్‌యు నాయకులు పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ.భూషణం, జిల్లా బన్నే వినోద్ మాట్లాడుతూ ఎస్టీ బాలికల హాస్టల్లో మెరుగైన సదుపాయాలు లేకపోవడం, వర్షాకాలం కావడంతో హాస్టల్లో వాడే నీటి వల్ల ఒక్కసారిగా అనేక మంది విద్యార్థినులు జ్వరాల బారిన పడ్డారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజన సదుపాయం కల్పించాలన్నారు.

కలెక్టరేట్ ఫైట్ !

(7వ పేజీ తరువాయి)

ప్రాంతాలకు తరలిస్తే ఊరుకోమంటూ వ్యాఖ్యానించారు. దీనిపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందించారు. పెద అమిరంలో ఎటువంటి ఖర్చు లేకుండా నిర్మాణం చేపట్టాలని అనుకుంటున్నాం. ఇది భీమవరంలో భాగమే. కూతవేటు దూరంలోనే పెద అమిరం ఉంది.ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బంది ఉండదని ప్రకటించారు. ఇది విన్న భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు మరో ప్రకటన చేశారు. భ్రమలు వద్దు.. అపోహలు వద్దు. భీమవరంలోనే కలెక్టరేట్ ఉంటుందని స్పష్టం చేశారు. ఇలా జిల్లా కలెక్టరేట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పుడు ఏమవుతుందోనని జిల్లా వ్యాప్తంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

తరలిస్తే ఉద్యమిస్తాం : కాంగ్రెస్, వైసీపీ

కలెక్టరేట్‌ను తరలిస్తే ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారాం హెచ్చరించారు. ప్రకాశం చౌక్‌లో మంగళవారం నిరసన తెలిపారు. భీమవరం నుంచి కలెక్టరేట్‌ను ఉండి నియోజకవర్గానికి తరలించాలని చూస్తే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని వైసీపీ ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ హెచ్చరించారు.. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కలెక్టరేట్ కార్యాలయాన్ని ఉండి నియోజకవర్గం పెదఅమిరం తరలిస్తారని వస్తున్న వార్తలపై వైసీపీ నాయకులు మండిపడ్డారు.

మట్టి గణపతికే జై..

ఏలూరుసిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు వినాయక పందిళ్లలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలనే ఎక్కువగా వినియోగించే వారు. అ యితే మారుతున్న కాలానికి అనుగుణంగా దాదాపు 12 ఏళ్ల నుంచి కేవలం ఏకో ఫ్రెండ్లీ గణేశ్ అనే నినాదంతో మట్టి విగ్రహాలను ఎక్కువగా పూజించడం జరుగుతోంది. ఇంతకుముందు చిన్న ప్రతిమలను మాత్రమే మట్టి విగ్రహాలను పూజించినా ఇప్పుడు పెద్ద విగ్రహాలను కూడా మట్టి విగ్రహాలనే వినియోగించి పర్యావరణాన్ని రక్షించడానికి గణేశ్ పడపాల నిర్వాహకులు కృషి చేస్తు న్నారు. మట్టి విగ్రహాన్ని పూజించి నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని పర్యా వరణ వేత్తలు చెబుతున్నారు. మట్టి వినాయకుడిని పూజించాలని గత కొంతకాలంగా ఎన్నో సంస్థలు వినాయక చవితి పండుగ రోజున ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్నారు.

● పర్యావరణ పరిరక్షణకు

మట్టి గణపతి

- ఎం.గురుశర్మ, సాహితీ కళారత్న

కాలుష్య నివారణకు మట్టి గణపతినే పూజించాలి. మట్టి వినాయకుడిని నిమ జ్జనం చేయడం వల్ల కాలు వలు, చెరు వుల్లో జల చరాలకు ఎటువంటి హాని జర గదు. ఈ ఉద్దేశంతోనే గత 12 ఏళ్లుగా ఏలూరులో వినాయక చవితి పండుగ రోజున ఉచితంగా మట్టి గణపతిని పంపిణీ చేయడం జరుగుతోంది. పూజలో వినియోగించే పత్రిని, వినాయక వ్రతకల్పం పుస్తకాన్ని ఉచితంగా అందజేయడం జరుగుతోంది. పాఠశాలలు, కళాశాలల్లో మట్టి వినాయకుడినే ఎందుకు పూజించాల్లో విద్యార్థులకు వివరించడం జరుగుతోంది.


మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గణపతి ఉత్సవాలకు సర్వం సిద్ధం..

ఏలూరు రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. యువకులు, చిన్నారులు పోటాపోటీగా ఏర్పాట్లలో మునిగారు. వివిధ డిజైన్లతో కూడిన విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేసుకున్నారు. కొన్ని చోట్ల గణపతి కొలువు దీరడంతో సర్వత్రా సందడి నెలకొంది.చవితి వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ నాగబాబు పిలుపునిచ్చారు. ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెన్న శ్రీలత ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్ రాజు పాల్గొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, జనసేన నాయకులు నారా శేషు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో పది వేల వినాయక ప్రతిమలు, వినాయక వ్రతకల్ప పుస్తకాలు పంపిణీ చేశారు. జూట్ మిల్లు వద్ద ఉన్న ధర్మబేరి ప్రాంగణంతో పాటు నగరంలో వీటిని పంపిణీ చేశారు.మారం హనుమంతరావు, భీమవరపు సురేశ్ పాల్గొన్నారు. అలాగే స్థానిక పేరయ్య కోనేరు సమీపంలోని ఆంజనేయ స్వామి కోవెల వద్ద ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పూలమొక్కలు, తులసి మొక్కలు పంపిణీ చేశారు. రీజనల్ కార్యదర్శి కొల్లు సత్యనారాయణ, హైమావతి, ఎం లక్ష్మీ నరసింహరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● నిడమర్రు: పర్యావరణ హితమైన మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దామంటూ లయన్స్ క్లబ్ ఆఫ్ గణపవరం సభ్యులు నడుం బిగించారు. మంగళవారం భువ్వనపల్లి హీరో షోరూం వద్ద గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వెల్లంకి నరేశ్‌కుమార్, కార్యదర్శి కిలారి రవిబాబు, ట్రెజరర్ సత్యనారాయణ మూర్తి, లయన్స్ క్లబ్ సభ్యులు పి.నాగేశ్వరరావు, సూర్య ప్రకాష్, ముత్యాల నారాయణ, కె.శైలజ పాల్గొన్నారు.

● భీమడోలు: చవితి వేడుకలను శాంతి యుత వాతావరణంలో నిర్వహించుకోవాలని తహసీల్దార్ రమాదేవి, సీఐ విల్సన్ సూచించారు. తహసీల్దార్, సీఐ కార్యాయలంలో వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో చవితి ఉత్సవాల నిర్వహణకు సూచనలిచ్చారు. అధికారుల సూచనలు పాటించాలని ఎస్ఐ సుధాకర్ పేర్కొన్నారు.

● జీలుగుమిల్లి: శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఆధ్యాత్మిక వాతావరణంలో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలని పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. జీలుగుమిల్లిలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీల నిర్వాహకులు సీఐలు, ఎస్సైల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఆయా కమిటీలు ముందుగానే పోలీస్ అధికారులను సంప్రదించి అనుమతి తీసుకోవాలన్నారు.

● జీలుగుమిల్లి: జనసేన పార్టీ మండలాధ్యక్షులు పసుపులేటి రాము ఆధ్వర్యంలో జీలుగుమిల్లి బస్ షెల్టర్ వద్ద మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. పర్యావరణ హితం కోరి ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించాలన్నారు. కోలా మధు, బండారు అనిల్, చామన శేఖర్ ఉన్నారు.

● పోలవరం: వినాయకచవితి నేపథ్యంలో పోలవరం మండలంలో మంగళవారం మట్టి గణపతులు, పత్రి పూజా సామగ్రి అమ్మకాలు జోరుగా కొనసాగాయి. స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో మట్టిగణపతులు, పూజా సామగ్రి, పత్రి కొనుగోలు కోసం ప్రజానీకం ఎగబడ్డారు. వర్షంలో సైతం అమ్మకాలు జోరుగా సాగాయి. గత ఏడాదితో పోలిస్తే విగ్రహాల ఏర్పాటు తగ్గింది.

● నిడమర్రు:మండలంలో భువ్వనపల్లి, అడవికొలను, ఛానమిల్లి, క్రొవ్విడి, పెదనింద్రకొలను, నిడమర్రు, పత్తేపురం గ్రామాల్లో గణేష్ చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు కమిటీ కుర్రాళ్లు ఏర్పాట్లు చేశారు.

● టి.నర్సాపురం: నక్కినవారిగూడెం, కేతవరం, అప్పలరాజుగూడెం, బండివారిగూడెం, బొర్రంపాలెం, వెలగపాడు, తదితర గ్రామాల్లో గణపతి ఉత్సవాలకు ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. బండివారి గూడెం, కొత్తగూడెం, కేతవరం, వీరభద్రవరం గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఆయా కమిటీల ఆధ్వర్యంలో చలువ పందిర్లను అలంకరించారు.

● కొయ్యలగూడెం: ప్రతి ఒక్కరు మట్టి గణపతినే పూజించాలని మానవత సంస్థ అధ్యక్షుడు మందపాటి రామకృష్ణ కోరారు.కొయ్యలగూడెం, పరింపూడి, అంకాలగూడెం,దిప్పకాయలపాడు, కన్నాపురం గ్రామాల్లో మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. సెక్రటరీ చంటిబాబు, కోశాధికారి చవ్వా రాము, స్వామి, సిద్దూ, వెంకటేశ్వరరావు, శ్రీను, నిడదవోలు రామారావు, ఖమ్మంపాటి సాయి, టెలిఫోన్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు:వినాయక చవితి ఉత్సవాలపై మంగళవారం కుక్కునూరు ఎస్.ఐ. నాగరాజు ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు జారీ చేశారు. వినాయకుడి ఉత్సవాలు నిర్వహించే కమిటీలు పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. వినాయకచవితి ఉత్సవాలకు పోలీసులు అన్ని విధాలా సహకారం అందిస్తారని ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులు చేసిన సూచనలు అమలు చేసి ఆనందంగా ఉత్సవం జరుపుకోవాలని ఎస్.ఐ. సూచించారు.

● జంగారెడ్డిగూడెం: వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో పాటు, పర్యావరణాన్ని పరిరక్షించేలా భక్తులు జరుపుకోవాలని పట్టణానికి చెందిన చామర్తి శ్రీరాములు అన్నారు. మంగళవారం వెయ్యి మట్టి వినా యకుని విగ్రహాలతో పాటు తులసి మొక్కలను ప్రజ లకు పంపిణీ చేశారు. సిటీకేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు పెనుమర్తి సురేష్, సంధ్య, కనుపర్తి ధనకుమార్,ఎలికే తాతారావు, మాన వతా జిల్లా కన్వీనర్ త్రిపుర రమేశ్, చామర్తి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


నిడమర్రులో గణపతి ప్రతిమల పంపిణీ దృశ్యం

● పెదపాడు: మట్టి గణపతులను పూజిద్దామని ఏలూరు తహసీల్దారు గాయత్రి తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులతో తయారు చేయించిన మట్టి గణపతులను మంగళవారం తహసీల్దారు గాయత్రి పంపిణీ చేశారు.

● పెదవేగి:విజయరాయిలో వివేకానంద ఎక్సలెంట్ సోషల్ సర్వీస్ సెంటర్ అధ్యక్షుడు నర్రా రాంబాబు ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందించారు. పర్యావరణ హితానికి దోహదపడే మట్టి వినాయకులను పూజించాలన్నారు.

● ఏలూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలం ధర్మాజీగూడెం శ్రీవిద్య పాఠశాలలో చలసాని రత్నాకర్ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత మట్టి విగ్రహాలు తయారు చేయించారు. చలసాని రత్నాకర్ మాట్లాడుతూ పర్యావరణంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులు శివపార్వతులు, గణనాదుని వేషధారణలతో అలరించారు. రంగాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మట్టి గణపతినే పూజించాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న చింతమనేని

దివ్యాంగులకు వెసులు బాటు

పెదపాడు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కోసం వెసులుబాటు కల్పించేలా ప్రత్యేక సదరం క్యాంపు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సంబంధిత అధికారుల సమక్షంలో సమీక్షా సమావేశాన్ని ఎమ్మెల్యే చింతమనేని నిర్వహించారు. సచివాలయాల సిబ్బంది వారి దరఖాస్తుతో పాటుగా స్థితిగతుల వివరాలను నమోదు చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, కొమ్మన వెంకటశ్రీధర్, సొసైటీ అధ్యక్షులు కొమ్మన లక్ష్మణమోహన్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

దెందులూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ అనిల్ కుమారి అన్నారు. మంగళవారం సత్యనారాయణపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏవో ఎల్.శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వ పథకాలు సబ్సిడీలపై అవగహన కల్పించారు. సీతంపేట కాల్వ నీటి సంఘం అధ్యక్షుడు పర్వతనేని రంగారావు, దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కలపాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జనసేన స్థూపం వివాదం

ఏలూరు రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఏలూరు పడమర వీధిలోని 17వ డివిజన్‌లో నిర్మించిన జనసేన స్థూపం గాంధీ జ్ఞానమందిరం స్థలానికి సంబంధం లేదని ఏలూరు జనసేన నగర అధ్యక్షులు వీరంకి పండు, 17వ డివిజన్ ఇన్‌చార్జి లక్కింశెట్టి కిరణ్ కుమార్ తెలిపారు. స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నాలుగైదు రోజులుగా ఈ డివిజన్లో జనసేన స్థూపం కడుతుంటే పనిపాట లేని కొందరు కాంగ్రెస్ నాయకులు ఈస్థలం దగ్గరికి వచ్చి గాంధీ జ్ఞాన మందిరంలోనే జనసేన స్థూపం కడుతున్నారని చెప్పి జనసేన నాయకులపై కమిషనర్, కలెక్టర్, డీఎస్పీ, ఎమ్మెల్యేకి వినతిపత్రాలు ఇచ్చారని మండిపడ్డారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

ఏలూరుటూటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నగరంలో పెరుగుతున్న కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. తూర్పు లాకుల వద్ద కృష్ణకాల్వ వెంబడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు.


వినతిపత్రం అందిస్తున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికుల ఆందోళన

పోలవరం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం పట్ల పోలవరం శ్రీ చైతన్య ఆటో యూనియన్ కార్మికులు మంగళవారం స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో భిక్షాటన, వంటవార్పు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీగా తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహసీల్దారు కె.శ్రీనివాస్‌కి వినతి పత్రం అందజేశారు.ఆటో ఫైనాన్సులు, పిల్లలు చదువులు, ఇల్లు గడవడం కష్టమై ఇతర పట్టణాలకు వలస పోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. యూనియన్ అధ్యక్షులు తాళ్లపూడి చంద్రరావు, సబ్బారపు శ్రీను, ముత్యాల వెంకన్న, కొత్తపల్లి నాగరాజు, రాంబాబు, రాజు, బాజీ ఇతర ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి...

కుక్కునూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు వలన నష్టపోతున్న ఆటోకార్మికులకు నెలకు రూ.25 వేలు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.సాయి కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆటోడ్రైవర్ల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. పోచారపు వెంకటేశ్వర్లు, ధార కృష్ణ, వలి భాష, నాగరాజు, గోపి, రాము, సాగర్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

ఏలూరుటూటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారిని గుర్తించి లబ్ధి చేకూరుస్తున్నామని అన్నారు. అనంతరం గణేశ్ చతుర్థి వేడుకలకు హాజరుకావాలని స్థానికులు కోరారు. గణేశ్ ఉత్సవాలు ప్రజలంతా సంతోసంతో జరుపుకో వాలని ఆకాంక్షించారు.

ముఠా కార్మికుల వేతనాలు పెంచాలి

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఇఫ్టూ, ఏఐటీయూసీ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో మంగళ వారం లాగుడుబండ్ల ముఠా కార్మిక సంఘాల జనరల్ బాడీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో సంఘ నాయకులు గడసాల రాంబాబు, పుప్పాల కన్నబాబు, బండి వెంకటేశ్వ రరావు, రెడ్డి శ్రీనివాసడాంగేలు పచారీ షాపుల్లో లోడింగ్, అన్‌లైడింగ్,హమాలీ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు గతంలో రెండు సార్లు ఒప్పందాలు జరిగినప్పటికీ అమలు చేయలేదన్నారు. గతంలో చేసుకున్న ఒప్పందం ఈ ఏడాది ఏప్రిల్ 9వ తేదీతో ముగిసిందన్నారు. కూలి రేట్ల ఒప్పంద కాల పరిమితి ముగిసింది కాబట్టి రెండు సంఘాల తరపున విడివిడిగా కూలి రేట్లు పెంచాలని చాంబర్ అసోసియేషన్ వారికి లెటర్ ద్వారా తెలియజేశామన్నారు.జూన్ నెల వచ్చి నా చాంబర్ అసోసియేషన్ చర్చలకు పిలవలేదన్నారు. ఇప్పటికైనా చాంబర్ ప్రతినిధులు ఒప్పందం చేసుకోవాలని కార్మిక సంఘాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్మిక సంఘాల నాయకులు ఎ.అప్పలరాజు,యర్రా శ్రీనివాసరావు, జగ్గవరపు రమణ, ముంగము అప్పారావు, సందకం అప్పారావు, దూళ్ళ వీరి నాయుడు, అన్నవరం, ప్రసాద్, భూపతి, రామ్మూర్తినాయుడు, జనార్ధన్, విష్ణు, రాంబాబు, పిచ్చేటి శ్రీనివాసరావు, ఎస్.సోమేశ్వరరావు, కర్రం సురేష్, ఎస్.రాంబాబు, జి.అప్పారావు పాల్గొన్నారు.

వంతెన వద్ద పైపు లైన్ల మార్పు

ఉంగుటూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం వంతెన వద్ద మధ్యలో అమర్చిన డెల్టా గ్రామాల పైపు లైన్లు ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు వంతెన కిందికి మారుస్తున్నారు. సంబంధిత ఏఈ కంకిపాటి రామారావు నేతృత్వంలో ఈ పైపులైన్ల మార్పిడి చేపట్టారు. సు మారు రూ.5 లక్షలతో ఈ పైపు లైను మార్పిడి చేస్తున్నారు.

'ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి'

ముసునూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రశాంతి అన్నారు. రమణక్కపేట మెయిన్ పాఠశాలలో ఉన్న భవిత సెంటర్‌లో మంగళవారం దివ్యాంగ పిల్లలకు ఉచిత ఫిజియోథెరపీ క్యాంప్‌ను నిర్వహించారు. పదిమంది పిల్లలకు చికిత్స అందించి, వారిపట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్‌ఎం పి.భాస్కరరావు, ఐఈఆర్పీలు లక్ష్మీనారాయణ, నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించండి'

ముదినేపల్లి,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని వై.జంక్షన్ ప్రదేశంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్టు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగజగన్ బాబూరావు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయగా, పరిశీలనకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్య కూడలి ప్రదేశంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కోరామని తెలిపారు.

యూరియా విక్రయాల్లో వరి రైతులకు ప్రాధాన్యమివ్వాలి


ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న జిల్లా అధికారి హబీబ్ బాషా

ముసునూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వరి రైతులకు యూరియా ఎరువుల విక్రయాల్లో తొలి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. మంగళవారం ముసునూరులో శ్రీమహాలక్ష్మీ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్, విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి మాట్లాడారు. యూరియాతోపాటు ఎటువంటి లిక్విడ్‌ని రైతులకు విక్రయించవద్దని సూచించారు. యూరియా కొరత ఉన్న నేపథ్యంలో బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులను, పురుగుమందులను విక్రయించాలని, రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఏవో ఎ.చాముండేశ్వరి, వీహెచ్‌ఏ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

30న 'సేనతో సేనాని' విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

నూజివీడు టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 30న నిర్వహించే 'సేనతో సేనాని' జనసేన పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ అన్నారు. నూజివీడు జనసేన పార్టీ కార్యాలయంలో 'సేనతో సేనాని' సభ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి కార్యకర్తలు విశాఖపట్నం తరలిరావాలన్నారు. నూజివీడు మండల జనసేన అధ్యక్షుడు యర్రంశెట్టి రాము, చిరంజీవి యువత అధ్యక్షుడు బండారు రాజు, నూజివీడు ప్రాంతీయ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ముత్యాల కామేశ్, జనసేన నాయకులు ఎం.సునీల్‌కుమార్, రామిశెట్టి తేజశ్విని పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో భూషణ్‌కు బంగారు పతకం



పతకాన్ని అందుకుంటున్న భూషణ్

నూజివీడు టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో నూజివీడుకు చెందిన ఆయుష్ యోగా ట్రైనర్ పత్రి కనకభూషణ్ బంగారు పతకాన్ని సాధించారు. ఇటీవల తాడేపల్లిగూడెంలోని సరస్వతి విద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో సుమారు 700కు పైగా యోగాభ్యాసకులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పది విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా, నూజివీడుకు చెందిన పత్రి కనకభూషణ్ బంగారు పతకాన్ని సాధించారు. తద్వారా జాతీయస్థాయి యోగాసన పోటీలకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు.

ఆటోలకు క్యూఆర్ కోడ్‌లు

ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఏర్పాటు - ఆటో రికార్డులు సక్రమంగా ఉన్న వారికి ఏర్పాటు


క్యూఆర్ కోడ్ స్టిక్కర్ అంటిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : ఆటోల్లో ప్రయాణికులకు, ప్రజలకు భద్రత పెం పొందించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుం టున్నామని జిల్లా కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూ రు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏలూరు నగరంలో ఉన్న ఆటోలకు ట్రాఫిక్ పోలీస్ క్యూ ఆర్ కోడ్ కలిగిన డిజిటల్ స్టిక్కర్లను, డ్రైవర్లకు ఐడెంటిటీ కార్డులను ఎస్పీ మంగళవారం మధ్యాహ్నం అం దజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆటోల్లో ప్రయాణం చేసే ప్రజలకు సురక్షిత ప్రయాణం కోసం ఈ క్యూ ఆర్ కోడ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏలూరు నగరంలో నాలుగు వేల ఆటోలు ఉండగా, రెండు వేల ఆటోలకు ఇప్పటి వరకూ పోలీస్ డిజిటల్ క్యూ ఆర్ కోడ్, ఐడెంటీ కార్డులను అందజేశామని అన్నారు. మిగిలిన ఆటోలకు కూడా ఈ ప్రక్రియ సెప్టెంబర్ నెలాఖరులోపు పూర్తవుతుందని, ప్రతి ఆటో డ్రైవర్ ఆటోకు సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులను ట్రాఫిక్ పోలీసులకు అం దించి క్యూఆర్ కోడ్‌ను పొందాలన్నారు. ఆ తరు వాత స్పెషల్ డ్రైవ్ చేపట్టి నిబంధనలు ఉల్లం ఘించిన ఆటో డ్రైవర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. క్యూఆర్ కోడ్‌ను తమ ఫోన్‌లో స్కాన్ చేస్తే ఆటో నెంబర్, ఆటో డ్రైవర్ పేరు, ఫోన్ నెంబరు వివరాలు వస్తాయన్నారు. ఏమైనా లగేజీలు మర్చిపోయినా ఆ నెంబర్ ద్వారా వెంటనే సంప్రదించవచ్చన్నారు. ఏదైనా ప్రమా దం జరిగినప్పుడు ఆటోల వివరాలను క్షణాల్లో తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ ఉపయోగపడు తుందన్నారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుందన్నారు. కొన్ని ఆటోలు సరైన రికార్డులు లేకుండా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్న సమయాల్లో బాధి తులకు ఇన్సూరెన్స్, నష్టపరిహారం రాకుండా పోతుందన్నారు. దీని వల్ల ఎన్నో కుటుంబాలు ఇ బ్బందుల పాలవుతూ దిక్కులేనివిగా మారిపోతు న్నాయన్నారు. ఖచ్చితమైన రికార్డులు, ఇన్సూరె న్సు, డ్రైవింగ్ లైసెన్సులు ఉన్న ఆటోలకు మాత్ర మే క్యూఆర్ కోడ్ జారీ చేస్తున్నామన్నారు. క్యూఆర్ కోడ్ లేకుండా తిరిగే ఆటోలపై చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ సీఐ లక్ష్మణబాబు, త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, టూటౌన్ సీఐ కె అశోక్ కుమార్, ఆటో యూనియన్ నాయకులు లీలా కృష్ణ, సూరిబాబు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఫైట్!

(7వ పేజీ తరువాయి)

ప్రాంతాలకు తరలిస్తే ఊరుకోమంటూ వ్యాఖ్యానించారు. దీనిపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందించారు. పెదఅమిరంలో ఎటువంటి ఖర్చు లేకుండా నిర్మాణం చేపట్టాలని అనుకుంటున్నాం. ఇది భీమవరంలో భాగమే. కూతవేటు దూరంలోనే పెద అమిరం ఉంది. ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బంది ఉండదని ప్రకటించారు. ఇది విన్న భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు మరో ప్రకటన చేశారు. భ్రమలు వద్దు.. అపోహలు వద్దు. భీమవరంలోనే కలెక్టరేట్ ఉంటుందని స్పష్టం చేశారు. ఇలా జిల్లా కలెక్టరేట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పుడు ఏమవుతుందోనని జిల్లావ్యాప్తంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

తరలిస్తే ఉద్యమిస్తాం : కాంగ్రెస్, వైసీపీ

కలెక్టరేట్‌ను తరలిస్తే ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారాం హెచ్చరించారు. ప్రకాశం చౌక్‌లో మంగళవారం నిరసన తెలిపారు. భీమవరం నుంచి కలెక్టరేట్‌ను ఉండి నియోజక వర్గానికి తరలించాలని చూస్తే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని వైసీపీ ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ హెచ్చరించారు.. ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు కలెక్టరేట్ కార్యాలయాన్ని ఉండి నియోజక వర్గం పెదఅమిరం తరలిస్తారని వస్తున్న వార్తలపై వైసీపీ నాయకులు మండిపడ్డారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475


ఈదర గ్రామంలో ర్యాలీలో పాల్గొన్న ఈదర సర్పంచ్, విద్యార్థులు


కలిదిండిలో ఏర్పాటు చేసిన 12 అడుగుల వినాయకుడి విగ్రహం


ముదినేపల్లి హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు మట్టి ప్రతిమలు అందజేస్తున్న విద్యార్థులు

గణనాథుడి పూజకు వేళాయె

- మండపాలు ముస్తాబు
- చలువ పందిళ్లు సిద్ధం

నూజివీడు టౌన్/ముసునూరు/చాట్రాయి/ఆగిరిపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ పురస్కరించుకుని బుధవారం నుంచి ప్రారంభ మయ్యే గణనాథుల పూజలకు మండపాలు సుందరంగా ముస్తాబయ్యాయి. ఉత్సవాల కమిటీల ఆధ్వర్యంలో మండపాలను ఏర్పాటు చేసి, సుందరంగా అలంకరణ చేసి, విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. ముసునూరులో ఉత్సవాల కమిటీలకు పోలీసులు ప్రభుత్వ నిబంధనలపై అవగాహన కల్పిం చి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ ఎం. చిరంజీవి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. చాట్రాయి మండలం చనుబండ, చాట్రాయి గ్రామాల్లో పలువురు చిన్నారులు బంక మట్టితో చిన్న చిన్న వినాయక ప్రతిమలు తయారు చేసి స్నేహితులకు బంధువులకు పంపిణీ చేశారు. ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలలో సర్పంచ్ అనిత ఏసుపాదం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దామని ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుని సంధి పాము శారద, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కంచర్ల అంజయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి/మండవల్లి/కలిదిండి: ముదినేపల్లిలో వినాయకుడి విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. స్థానిక తయారీ కేంద్రంలో గతంలో కంటే విభిన్న ఆకృతుల్లో వినాయక విగ్రహాలు రూపుదిద్దుకున్నాయి. శివుడి భుజంపై ఎత్తుకున్న వినాయకుడి విగ్రహం అందరినీ ఆకర్షిస్తుంది. సన్ గ్లాస్‌ను పోలిన వినాయకుడి విగ్రహం ఈఏడాది వెరైటీగా చెప్పవచ్చు. ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్‌ఎం విజయకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు మట్టి వినాయకుడి విగ్రహాల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో మట్టి విగ్రహాలను తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం ఉపాధ్యాయులకు మట్టి ప్రతిమలను అందజేసి ఇళ్లకు తీసుకెళ్లారు. చిగురుకోట సెంటిని సిరామిక్స్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రాంబాబు, కాలుష్య నియంత్రణ శాఖ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు కంపెనీ నిర్వాహకులు గ్రామస్థులకు మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేశారు. మండవల్లి మండలం పెరికేగూడెం వెన్నార్ సిరామిక్స్ లిమిటెడ్ కంపెనీలో కంపెనీ వారు సమకూర్చిన 500 మట్టి వినాయక విగ్రహాలను ఆయన కార్మికులు, గ్రామస్థులకు పంపిణీ చేశారు. అసిస్టెంట్ ఇంజనీర్ రమేశ్, కంపెనీ జీఎం అమర్నాథ్, హెచ్ఆర్ ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు. కలిదిండి మండలంలో వినాయకుడి ఆలయాల వద్ద మండపాలు ముస్తాబయ్యాయి. కలిదిండిలో ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో మండపంలో 12 అడుగుల భారీ వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజులపాటు పూజలు చేయటానికి సర్వం సిద్ధం చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. కలిదిండి సెంటర్‌లో పూలు, పండ్లు పత్రులు వినాయకుడి మట్టి విగ్రహాలు పెద్ద ఎత్తున విక్రయించడంతో భక్తులతో కళకళలాడింది.

పర్యావరణ హితంగా గణనాథుల రూపకల్పన


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ

నూజివీడు టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం బాల్యం - భవిష్యత్ తరాలకు పర్యావరణాన్ని సజీవంగా అందిద్దాం. ఇందుకు చిన్నారులకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ గణనాథుని పుట్టినరోజునే ఆలంభనగా ముం దడుగు వేశారు. నూజివీడు త్రివిధ పాఠశాల విద్యార్థులు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేసి మన్ననలు పొందారు. పాఠశాలల్లోని దాదాపు 800మంది విద్యార్థులు ఈ మట్టి గణనాథులను రూపొందించటం విశేషం. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల స్థానంలో మట్టి విగ్రహాలతో గణనాథులను పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని నూజివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ అన్నారు. నూజివీడు పట్టణంలో ఉచితంగా మట్టి విగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మట్టి గణనాథులను పూజించడం ద్వారా చెరువులు, కాలువలను కాలుష్యానికి దూరంగా ఉంచవచ్చన్నారు.

చవితి పందిళ్లలో జాగ్రత్తలు పాటించాలి


ఆటపాకలో వినాయక మండపాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇబ్రహీం

కైకలూరు/ ముసునూరు/ ముదినేపల్లి/ కలిదిండి : వినాయక మండపాల్లో తగిన జాగ్రత్తలను కమిటీ సభ్యులు తీసుకోవాలని కైకలూరు మండల తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం సూచించారు. మంగళవారం కైకలూరు మండలం ఆటపాకలో వినాయక మండపాలను పోలీసు, ఫైర్, విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి జాయింట్ యాక్షన్ కమిటీ పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రతి విగ్రహం వద్ద సీసీ కెమెరాను ఏర్పాటు చేయాలని రాత్రి సమయాల్లో కమిటీ సభ్యులు విగ్రహాల వద్ద కాపలా ఉండాలన్నారు. టౌన్ సీఐ పి.కృష్ణ, అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతికు మార్, విద్యుత్‌శాఖ ఏఈ కె.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. ముసునూరు మండలంలో నిర్వహించే గణేశ్ ఉత్సవాల్లో ఎటువంటి అపశ్రుతులకు తావులేకుండా విజయ వంతం చేయాలని తహసీల్దార్ దాసరి ప్రశాంతి సూచించారు. సుమారు 50 విగ్రహాలకు అనుమతులిచ్చామని ఏఎస్ఐ బేగ్ వివరించారు. కలిదిండి మండలంలో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. ఎంపీడీవో ఫణీంద్ర, ఎస్ఐ వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాల బాధ్యత కమిటీలదే : సీఐ రవికుమార్

వినాయక నవరాత్రుల ఉత్సవాల నిర్వహణలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహక కమిటీలదేనని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. ముదినేపల్లి మండలంలోని వినాయక నవరాత్రుల ఉత్సవ కమిటీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ లతీఫ్‌పాషా, ఎస్ఐ వీరభద్రరావు, డిప్యూటీ ఎంపీడీవో అశోక్ పాల్గొన్నారు.

మార్కెట్లలో సందడి

ముదినేపల్లి/కలిదిండి : ముదినేపల్లి మండలం ముదినేపల్లి మార్కెట్‌లో మంగళవారం సందడి నెలకొంది. చవితికి అవసరమైన పూజాసామగ్రి, పత్రి, అమ్మకాలు జోరుగా సాగాయి. గతంలో కంటే పూజా సామగ్రి ధరలు భారీగా పెరిగాయి. వినాయకుడి పూజ వద్ద వినియోగించే పాలీల నుంచి పత్రి, కలువ పువ్వులు, పలు రకాల కాయలు, టెంకాయలు, పువ్వులు అన్నీ కలిపి సగటున వెయ్యి రూపాయల ధర పలికింది. టెంకాయ ఒక్కింటికి రూ.40 నుంచి రూ.50 వరకు ధరను పెంచేశారు. అదేవిధంగా కలిదిండి మండలం కలిదిండి మార్కెట్‌లో కొనుగోలుదారులతో కిటకిటలాడింది.


'ఏఐ'పై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు

'ఏఐ'తో విప్లవాత్మకమైన మార్పులు

నూజివీడు,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మెషీన్ లెర్నింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విప్లవాత్మకమైన మార్పులను తీసుకువస్తోందని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ అన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏడురోజుల పాటు వర్క్‌షాపు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రసాంకేతిక రంగాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శాసించే పరిస్థితి నెలకొందన్నారు. వ్యవసాయం, ఆరోగ్యరంగం తదితరాలు సైతం ఈ ఏఐతో ముందడుగు వేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఏఐపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉంటేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రొఫెసర్లు కేకే సింగ్, శ్రావణి, ఏవో లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

ముసునూరు,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని నూజివీడు క్లస్టర్ ఏపీడీ ఎం.రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కుంటలు, ప్లానిటేషన్, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్, ఇతర పనుల స్థితిగతులను సమీక్షించారు. ఏపీవో రోజీలీల తదితరులు పాల్గొన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న నత్తగుల్లపాడు గ్రామస్థులు

సర్పంచ్ వైఖరిని నిరసిస్తూ ఆందోళన

కైకలూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించకుండా ఆదాయాన్ని సర్పంచ్ దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని నత్తగుల్లపాడు గ్రామస్థులు ఆరోపించారు. మంగళవారం నత్తగుల్లపాడు గ్రామంలో ప్రజలు విలేకరులతో మాట్లాడారు. సర్పంచ్ ముంగర రామకృష్ణంరాజు తీరు సక్రమంగా లేదని గ్రామంలో విద్వేషాలు రెచ్చగొడుతూ రెండు వర్గాలుగా విభజిస్తున్నారని అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదన్నారు. గ్రామంలో ఊరచెరువు ద్వారా వచ్చిన ఆదాయాన్ని కొల్లేరు గ్రామాల కట్టుబాట్లు మధ్య ప్రజలకు పంచాల్సి ఉండగా వాటిని పూర్తిగా తినేశాడని అలాగే మంచినీటి కుళాయిలు, ఇంటిస్థలాల పంపిణీలో ప్రజల నుంచి రూ.వేల రూపాయలు అక్రమంగా వసూలు చేశారని వివరించారు. సర్పంచ్ వైఖరిని నిరసిస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. గ్రామస్థులు నబిగారి కృష్ణానందరావు, నబిగారి ఏడుకొండలు, ఘంటసాల చందు, ముంగర థామస్, కిరణ్‌కుమార్, ముంగర రంగారావు, మహిళలు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆగిరిపల్లి, ఆగస్టు 26, (ఆంధ్రజ్యోతి):పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి ఎం.ఉషాకుమారి అన్నారు. మంగళవారం ఆగిరిపల్లి మండలం చిన్నఆగిరిపల్లి గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం ఏలూరు వారి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస యోజన కింద రైతులకు వరిలో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏవో జె.భవాని, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



కైకలూరు, కలిదిండిల్లో మదర్ థెరిస్సా విగ్రహాలకు పూలమాలలు వేసిన వాకర్స్ సభ్యులు, టీడీపీ నాయకులు

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి వేడుకలు

కైకలూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మదర్ థెరిస్సా ఆశయాలు మహోన్నతమైనవని నేటి యువత వాటిని అనుసరించి ప్రజాసేవలో ముందంజలో ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం కైకలూరులో మదర్ థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. కోరుకొల్లు రోడ్డు సెంటర్లో థెరిస్సా విగ్రహానికి టీడీపీ నాయకులు, కైకలూరు సర్పంచ్ కేవీఎన్ఎం నాయుడు వార్డు సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ ఆధ్వర్యంలో థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబి, ఎస్సీ సెల్ నాయకుడు వి.సుధా, మాజీ సర్పంచ్ బోయిన శ్రీను, మైనార్టీ నాయకులు ఎండీ ఉస్మాన్, వాకర్స్ సభ్యులు కారే శరత్‌బాబు, వేణు, లక్ష్మణరావు, వినోద్, వెంకట్రావు, బషీద్, రామారావు, శివరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● కలిదిండి : కలిదిండిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద మదర్‌థెరిస్సా విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కలిదిండి గ్రామ టీడీపీ అధ్యక్షుడు అస్లాం, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, మదర్‌థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు చిట్టూరి భోగేశ్వరరావు, సానా రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలే కార్మికులకు రక్షణ : నాగమణి


మాట్లాడుతున్న జిల్లా సహాయ కార్యదర్శి నాగమణి

ముదినేపల్లి,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే పలు రంగాల కార్మికుల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని సీఐటీయూ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి పిలుపునిచ్చారు. ముదినేపల్లిలో మంగళవారం జరిగిన సీఐటీయూ మండల మహాసభలో ఆమె మాట్లాడారు. అనాదిగా పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కరించుకున్నామన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, వంట ఏజెన్సీ కార్మికులు, ఇతర కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు పోరాడుతామని వ్యవసాయ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. ఈ సందర్భంగా ముదినేపల్లి మండల సీఐటీయూ కమిటీ కన్వీనర్‌గా బండి పద్మ, కో-కన్వీనర్‌గా విజయ లక్ష్మి, అరుణకుమారి, నాగబాబు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులు జక్కుల మహేశ్, చిన్నం మాధవి, రిప్కా పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసుల్లో ఇద్దరికి జైలుశిక్ష

నూజివీడు టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాకీ నిమిత్తం చెల్లని చెక్కులు అందజేసిన ఇద్దరికి నూజివీడు ప్రత్యేకన్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. మండలంలోని రావిచర్లకు చెందిన పురాణం రామలక్ష్మి, నూజివీడుకు చెందిన మద్దిరాల కోటేశ్వరరావు నుంచి 2020లో రూ.5 లక్షలు అప్పుగా తీసుకుంది. బాకీ నిమిత్తం 2022, ఫిబ్రవరి 4న చెక్కు ఇవ్వగా, సదరు చెక్కు బ్యాంకు ఖాతాలో నగదు లేదని తిరిగి వచ్చింది. దీనిపై అతడు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా విచారణ జరిపిన న్యాయమూర్తి ఆమెకు ఆరునెలలు జైలుశిక్ష, జరిమానా విధించారు. మరో కేసులో నూజివీడుకు చెందిన నెల్లిమర్ల విఙ్ఞేశ్వరరావు 2019లో నూజివీడుకు చెందిన పెనిమల నాగమల్లేశ్వరరావుకు రూ.7 లక్షలు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తరువాత బాకీ తీర్చమని అడగ్గా నాగమల్లేశ్వరరావు రూ.6 లక్షలకు చెక్కు ఇవ్వగా, ఆ చెక్కును నగదు నిమిత్తం బ్యాంకులో వేయగా ఖాతాలో డబ్బులేదని తిరిగి వచ్చింది. కోర్టులో కేసువేయగా నాగమల్లేశ్వరరావుకు ఆరునెలలు జైలుశిక్ష, జరిమినా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

భూ సరిహద్దు వివాదం.. నలుగురిపై కేసు

ముసునూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇళ్లస్థలం పంపకం, భూ సరిహద్దు వివాదంపై కేసు నమోదు చేశామని ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. మండలంలోని వలసపల్లి గ్రామానికి చెందిన సొంగ జ్యోతికి, ఆమె బావ సొంగ రమేష్‌కు మధ్య రెండేళ్లుగా ఇళ్ల స్థలం పంపకాలు, భూమి సరిహద్దు వివాదంపై గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 24న సదరు వివాదంపై గ్రామ పెద్దలు సమక్షంలో పంచాయతీ జరుగుతుండగా సొంగ సన్నీ, నిర్మల్, వర్మ ముగ్గురు అన్నదమ్ములు కలిసి జ్యోతిపై దుర్భాషలాడి కర్రలతో దాడికి పాల్పడ్డారు. అడ్డువచ్చిన జ్యోతి భర్త మధుబాబు, అతని కుమారుడు కాంత్రిలపై దాడికి యత్నించారు. వారిని చంపేయాలని సొంగ రమేష్ రెచ్చగొట్టడంతో వారు మరోసారి దాడికి పాల్పడంతో పెద్దలు సుగుణరావు, పల్లిశ్రీను, రాంబాబు తదితరులు వారిని అడ్డుకున్నారు. ఈ దాడిలో జ్యోతికి తీవ్ర గాయాలు అవడంతో నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


ఎల్‌వోసీ లెటర్‌ను అందిస్తున్న మంత్రి సారథి

పేదలకు భరోసాగా 'సీఎం సహాయ నిధి'

నూజివీడు టౌన్,ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పేదలకు భరోసాగా మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం సహాయ నిధి తోడ్పడుతుందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో వైద్యచికిత్స నిమిత్తం ఎల్‌వోసీ పత్రాలను బాధిత కుటుంబసభ్యులకు మంగళవారం అందించారు. ముసునూరు మండలం చింతలవల్లికి చెందిన కమలకుమారి, ఆగిరిపల్లి మండలం వడ్లమానుకు చెందిన పి.లక్ష్మి, నూజివీడు మండలం ముక్కొల్లుపాడు గ్రామానికి చెందిన పి.సుందరమ్మ, పల్లెర్లమూడి గ్రామానికి చెందిన వి.కుమారి కుటుంబ సభ్యులకు మొత్తం రూ.11లక్షలు విలువచేసే ఎల్‌వోసీ పత్రాలను అందించారు.

21మందికి పనిముట్ల పంపిణీ

చాట్రాయి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విశ్వకర్మ యోజన పథకం కింద మండలంలో పలు గ్రామాలకు చెందిన 21 మంది చేతి వృత్తిదారులకు మంగళవారం చనుబండ సబ్ పోస్టాఫీస్ ద్వారా పనిముట్లు అందజేశారు. ఈ పథకం కింద చేతి వృత్తిదారులకు ఇటీవల గుడివాడలో నైపుణ్య శిక్షణ ఇచ్చి రవాణా ఇతర ఖర్చుల నిమిత్తం రూ.4 వేల చొప్పున వారి ఖాతాలలో జమ చేయడంతో పాటు రూ.15 వేల విలువైన పనిముట్ల కిట్లను అందజేశారు. ఇప్పటివరకు మండలంలో 71 మంది వృత్తిదారులకు రూ.10.65 లక్షల విలువైన పనిముట్లు అందజేశారు. సబ్ పోస్ట్‌మాస్టర్ రాంబాబు, కూటమి నాయకులు కొత్తగుండ్ల రమేష్, నెక్కలపు వెంకటేశ్వరరావు, ఆదిమూలం శర్మ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.